విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

ఆదివారం 28 సెప్టెంబరు 2025 8 పేజీలు

ఇంద్రకీలాద్రి కిటకిట

శ్రీ లలితా త్రిపురసుందరి దేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ

దుర్గగుడికి భారీగా తరలివచ్చిన భక్తులు

విశాలాంధ్ర-విజయవాడ: నవరాత్రుల్లో ఆరవ రోజు శ్రీ లలితా త్రిపురసుందరి దేవి అలంకారంలో దురగ్మ దర్శనమిచ్చారు. ఈ అవతారంలో పట్టు వస్త్రాలు, రత్నాభరణాలు ధరించి, శోభాయమానంగా భక్తులకు దర్శన మిస్తారు. తల్లి ముఖచంద్రుడిపై సింహాసనం నుంచి వెలువడే కాంతి భక్తుల హృదయాలను కట్టిపడేంచింది. నిజమైన సౌందర్యం వెలుపలి అందంలో కాక, మనసులోని నిర్మలత్వం, జ్ఞానం, ప్రేమ, కరుణలో ఉంటుందని. తల్లి త్రిపురసుందరి సాక్షాత్కారంతో భక్తుల మనసులు పవిత్రమై, ధర్మమార్గంలో నడిపిస్తుంది.కనకదుర్గ ఆలయంలో ఈ అలంకారం చూసిన భక్తులు జీవితాంతం మరువలేని అనుభూతి పొందుతారు.

నేడు శ్రీ మహా చండీదేవి గా దుర్గమ్మ

విశాలాంధ్ర-విజయవాడ: దసరా ఉత్సవాల్లో భాగంగా 7వ రోజు ఆదివారం కనకదుర్గమ్మ శ్రీ మహాచండిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం కానుంది. ఈ రోజు అమ్మవారికి నారింజ రంగు వస్త్రాలు , పువ్వులతో అలంకరించడంతో శుభప్రదంగా భావించి ఈ రంగు శక్తికి సానుకూలతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వజ్రాలు పొదిగినా గరిటెతో సాక్షాత్తుగా ఈశ్వరునికే భిక్షను అందించే ఘట్టము అద్భుతము. ఆమె దర్శనము సర్వపుణ్య ప్రదాయకము. లోకంలో జీవుల ఆకలిని తీర్చటం కన్నా మిన్న ఏది లేదు.

ఆంధ్రా యూనివర్సిటీ వీసీ

రాజీనామా చేయాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం సాయికుమార్

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రా యూనివర్శిటీలో విద్యార్థి మణికంఠ మరణానికి కారణమైన ఉపకులపతి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం సాయికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక దాసరి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటీలో బీఈడీ సెకండ్ ఇయర్ చదువుతున్న మణికంఠ అనారోగ్యం పాలవడంతో తనతో ఉన్న తోటి విద్యార్థులు వెంటనే యూనివర్సిటీ అంబులెన్స్ కు తెలియపరచగా అందులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. ఆ విద్యార్థికి ఆక్సిజన్ అందకపోవడంతో మరణించాడని అంబులెన్స్‌లో కనీసం ఆక్సిజన్ సిలిండర్లు కూడా లేకపోవడం సిగ్గుచేటన్నారు. విద్యార్థులు , ఏఐఎస్ఎఫ్ నాయకత్వం గతంలో ఆంధ్ర

యూనివర్సిటీలో మౌలిక సదుపాయాలు లేవని , ఆహారం బాగోలేదని మరియు ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయమని అనేకమార్లు ఉపకులపతికి నిరసన, ధర్నాలు చేపట్టామని తెలిపారు. ఆ సమస్యలు మిగతా 2 లో ...

మెంటార్ సిటీగా జీఎంసీ

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: స్వచ్ఛ సూపర్ లీగ్ సిటీల్లో చేరిన గుంటూరు నగరపాలక సంస్థను స్థానిక మునిసిపాలిటీలను స్వచ్ఛ పట్టణాలుగా స్వచ్ఛ షహర్ జోడిగా తీర్చిదిద్దడానికి మెంటార్ సిటీగా స్వచ్ఛ భారత్ మిషన్ ప్రకటించడం గర్వకారణమని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో స్వచ్ఛ భారత్ మిషన్ ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ జాతీయ స్థాయిలో 23 స్వచ్ఛ సూపర్ లీగ్ సిటిల్లో స్థానం సాధించడంతో స్థానిక మునిసిపాలిటీలలో స్వచ్ఛత కార్యాక్రమాలు చేపట్టేలా, వారికి తగిన మిగతా 2 లో ...

యువజన సమాఖ్యలో పాట్రు చురుకైన పాత్ర 3 లో ...

గాంధీ ఆశయాలకు అనుగుణంగా సేవలందించాలి 3 లో ...

రోడ్డు నిర్మాణం చేపడితే చూస్తూ ఊరుకోం 4 లో ...

మణికంఠ కుటుంబానికి న్యాయం చేయాలి 8 లో ...

దసరా కానుకగా టీచర్లకు

డీఏ ప్రకటించాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు ఉపాధ్యాయులకు దసరా పండుగ కానుకగా కరువు భత్యం(డీఏ) ప్రకటించాలని ఏస్టీయు రాష్ట్ర ఆర్థి క కార్యదర్శి కే కోటేశ్వరరావు, రాష్ట్ర డైరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు కోరారు. శనివారం ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2024జనవరి నుండి నాలుగు డి ఏ లు ప్రకటించాల్సి ఉందని, రెండు డి ఏ లైనా ప్రకటించాలని కోరారు. గత ప్రభుత్వం పిఆర్సి బకాయిలు,డి,ఏ బకాయిలు పెండింగ్లో ఉంచిందని, ఆ బకాయిలు విడుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం మిగతా 2 లో ...

ఈ-పంట నమోదు వేగవంతం

జిల్లా కలెక్టర్ డీకె.బాలాజీ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : జిల్లాలో ఈ-పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ డీకె. బాలాజీ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో శనివారం జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్ తో కలిసి జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జిల్లాకు సంబందిం చిరాష్ట్ర ముఖ్యమంత్రి చర్చించిన అంశాలు, సమస్యలపై రెండవరోజు చర్చ కొనసాగించగా వివిద శాఖల అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు సంబందించి భవిష్యత్తులో రైతులకు ఇబ్బందులు రాకుండా ఈ-పంట నమోదు మిగతా 2 లో ...

బస్సులు పెంచాలి

ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వలి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: దసరా పండుగ రద్దీ దృష్ట్యా తక్షణమే బస్సుల సంఖ్యను పెంచాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గుంటూరు ప్రధాన బస్టాండ్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వలి మాట్లాడుతూ దసరా పండుగ సెలవుల కారణంగా గుంటూరు ఎన్టీఆర్ ప్రధాన బస్టాండు రద్దీతో కిక్కిరిసిపోయిందన్నారు. ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయకుండా ఆర్టీసీ ప్రయాణికులను గాలికొదిలేసిందని విమర్శించారు. చాలీచాలని బస్సులు మాత్రమే అందుబాటులో ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, స్వస్థలాలకు వెళ్లేందుకు బస్టాండులో గంటల కొద్దీ వేచి చూడాల్సి వస్తోందన్నారు. దసరా పండుగ సమయంలో అదనపు బస్సులు నడపకపోవడం ఆర్టీసీ నిర్లక్ష్యమని విమర్శించారు. వెంటనే బస్సుల సంఖ్యను పెంచాలని లేకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రా యూనివర్సిటీ వీసీ రాజీనామా చేయాలి

పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించారని అన్నారు. విద్యార్థి మరణించడం మాకు తెలిసింది అని అంటూనే ఒక చిన్న సమస్యను విద్యార్థి సంఘాలు రాజకీయాలు చేస్తున్నాయని మంత్రి నారా లోకేష్ అనడం చాలా సిగ్గుచేటన్నారు. నెలకొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని, కావాల్సినటువంటి మౌలిక సదుపాయాలను అందిస్తాము భరోసా కల్పించకుండా మా అమ్మను అన్నారు....! మా అమ్మను అన్నారు అంటూ అనేకమార్లు బాధపడుతున్న నారా లోకేష్ మరి ఇప్పుడు మణికంఠ తల్లి బాధ మీకు అర్థం కావట్లేదా అని ప్రశ్నించారు. విశ్వవిద్యాలయాలు అంటే మన రాష్ట్రంలోనే కాదు దేశంలో కూడా ఎక్కడైనా ఒక విశ్వవిద్యాలయం ఉంటే దాని కనీసం మౌలిక వసతుల్లో వసతి గృహం ఉంటుందన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ఉన్న కృష్ణ యూనివర్సిటీకి ఇప్పటివరకు వసతిగృహం కాదు కదా కనీసం ఒక అంబులెన్స్ కూడా లేనటువంటి పరిస్థితి దరిద్రం మన రాష్ట్రంలో నెలకొంటుందన్నారు. ఇలాంటి సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి వాటన్నిటిని పరిష్కరించాలని విద్యాశాఖ మంత్రిని మరియు రాష్ట్ర ప్రభుత్వాన్ని హితవు పలికారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాదిక్ బాబు, విజయవాడ నగర అధ్యక్షులు రంజిత్ నాయకులు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మెంటార్ సిటీగా జీఎంసీ

ప్రోత్సాహం, మార్గదర్శకత్వం చేయడానికి స్వచ్ఛ షహర్ జోడికి మెంటార్ సిటీగా స్వచ్ఛ భారత్ మిషన్ ప్రకటించిందన్నారు. అందులో భాగంగా పొదిలి, ఆత్మకూరు(కే), నందికొట్కూరు, బేతంచర్ల, నూజివీడు మునిసిపాలిటీలకు మెంటార్ గా ఉండెందుకు శనివారం ఎంఓయు చేసుకున్నామని తెలిపారు. రానున్న 100 రోజుల్లో సదరు మునిసిపాలిటీల్లో పారిశుధ్యం మెరుగుదల చేయడానికి తగిన తోడ్పాటు, అవగాహనను జీఎంసి నుండి కల్పిస్తామని తెలిపారు.

టీచర్లకు టీచర్లకు డీఏ ప్రకటించాలి

తగ్గించాలని, అసెస్మెంట్ బుక్ విధానం తొలగించాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ ప్రారంభించాలని కోరారు.12వ పి ఆర్ సి కమిషనర్ ని నియమించాలని, ఆలస్యం అయ్యే నేపథ్యంలో30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. ఉద్యోగులు ఉపాధ్యాయ సంఘాల తో రాష్ట్ర ముఖ్యమంత్రి సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలు చర్చించాలని కోరారు. గత 15 నెలలుగా ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మూల్యాంకన పుస్తకాలు విద్యార్థులకు ఉపాధ్యాయులకు భారంగా మారాయని వాటి విషయంలో మరొకసారి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ పునః పరిశీలించి రద్దు చేయాలని కోరారు. మెగా డీఎస్సీ 2025 ఉపాధ్యాయుల నియామకానికి ముందే క్లస్టర్ ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని కోరారు. గౌరవ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఉపాధ్యాయులందరూ టెట్ పాస్ కావాలనే నిబంధన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు ఈ సమావేశంలో సంఘ నిర్మాణం వార్షిక కౌన్సిల్ నిర్వహణ,గురించి చర్చించారు చిలకలూరిపేట ఏరియా కార్యదర్శి వినుకొండ అక్కయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు, వడ్డాన జయప్రకాష్, నాదెండ్ల మండల అధ్యక్షులు షేక్ మక్బూల్ బాషా, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, చిలకలూరిపేట మండల అధ్యక్షులు బొంత రవి,షేక్ మస్తాన్ వలి, వి రమణ నాయక్, ఎడ్లపాడు మండల అధ్యక్షులు జి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్, సీనియర్ నాయకులు చావల మల్లేశ్వరరావు,ఇనకొల్లు అంకమ్మరావు, పి.సాగర్ బాబు,ఎం చిన్నవెంకటస్వామి,కుంభ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఎక్విప్మెంట్స్ పరికరాలు పరిశీలన

విశాలాంధ్ర-పెదన: పట్టణంలో మున్సిపల్ ఆఫీస్ లో గల ఇంజనీరింగ్ విభాగం నందు కొత్తగా కొనుగోలు చేసిన వాటర్ క్వాలిటీ టెస్టింగ్ ఎక్విప్మెంట్స్ టీడీ మీటర్, ఫ్లోర్ స్కోప్, హెచ్ టు ఎస్ బ్యాక్టీరియల్ టెస్టింగ్ ఎక్విప్మెంట్స్ మొదలైన పరికరాలను సీనియర్ కౌన్సిలర్ కటకం. ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ లింగం రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ కాగిత సీతారామాంజనేయులు, సచివాలయ సిబ్బంది, వాటర్ హౌస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు వేగవంతం

పూర్తి చేయాలని, ప్రకృతి విపత్తులు సంభవించి రైతులు పంటను కోల్పోతే నష్టపరిహారం, పంట భీమా పొందేందుకు, ధాన్యంకొనుగోలు వంటి వాటికి ఈ-పంట నమోదు తప్పనిసరి అని ఆలస్యం చేయకుండా గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్, తల్లికి వందనం పథకాల కింద నగదు జమ కాని లబ్దిదారుల సాంకేతిక సమస్యలను పరిష్కరించాలన్నారు. బ్యాంకు ఖాతాను తెరవడం, బ్యాంక్ అకౌంట్ కు ఆధార్ నంబరు అనుసంధానం చేయడంపై లబ్దిదారులకు వివరించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో శనివారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా జిల్లా పంచాయితీ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ పాల్గొన్నారు. బందరు డివిజన్ పరిధిలోని గ్రామ పంచాయితీ పారిశుధ్య కార్మికులకు శానిటరీ కిట్లు, యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ మాట్లాడుతూ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పర్యావరణాన్ని పరిరక్షించడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో ఘనమైనదని కొనియాడారు. వారి సంక్షేమం కాపాడవలసిన బాధ్యత ఉందని, వారికి శానిటరీ కిట్లు పంపిణీ చేయడంతో పాటు ఆరోగ్య భద్రత కల్పించామన్నారు. వ్యర్థాలను తొలగిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పారిశుధ్య కార్మికుల కు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, అలాగే అనుకోని పరిస్థితుల్లో ప్రమాదాలకు గురై మరణించినా, శాశ్వత వైకల్యం కలిగినా వారి కుటుంబాలకు అండగా ఉండేందుకు 10లక్షల రూపాయల విలువైన భీమా సౌకర్యం కల్పించాం అని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బోయ నాగమణి, జిల్లా పంచాయితీ అధికారిణి డా. జె. అరుణ ఇతర అధికారులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ : హిందుపూరం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆయనకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతర బాలకృష్ణ మీడియాతో మాట్లడుతూ అమ్మ అనుగ్రహం రాష్ట్రం, రాష్ట్ర ప్రజలపై ఉండాలని కోరుకున్నారు. తండోపతండాలుగా వస్తున్న భక్తులకు దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాలు బాగున్నాయని తెలిపారు. ఆలయ కార్య నిర్వహణ అధికారివీకే శీనా నాయక్ ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. పాలకమండలి చైర్మన్‌గా నియమితులైన బొర్రా రాధాకృష్ణ ఆలయ ప్రాంగణంలో భక్తుల అవసరాలను గమనిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కూన రవిమకుమార్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, కెడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘరామ్ తదితరులు కనకదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ పంట నమోదు తప్పనిసరి : ఏవో

విశాలాంధ్ర-పెదన: అన్నదాతలకు ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పుడు ఆదుకోవాలన్నా, పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నా, మద్దతు ధర లభించాలన్న ఈ పంట నమోదు తప్పనిసరని రైతులు సాగు చేసిన పంట వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు వద్ద నమోదు చేసుకోవడంలో అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయ శాఖ అధికారిని సజ్జా. జెన్నీ సూచించారు. ఈ మేరకు పెదన మండలం నడుపూరు గ్రామంలో మండల తహసిల్దార్ ఆధ్వర్యంలో రైతు సేవ కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు ఈ పంట నమోదు త్వరితగతన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు 65% పంట నమోదు జరిగిందని మిగిలిన 35 శాతం పంట నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని, రైతులు యొక్క ఈ కేవైసీ ని కూడా పూర్తి చేయాలని జెన్నీ అధికారులను ఆదేశించారు.

తెలుగు భాష, సాహిత్యం కోసం మండలి కృషి అపారం : గుమ్మడి

విశాలాంధ్ర-ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత నాయకులు, ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) జనసైనికుల ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు వర్ధంతి కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత శీలంవారి పాలెంలో రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గోపాలకృష్ణ, శీలం దివాకర్ - రాణి దంపతులు, శీలం అశ్విన్ - ప్రభ దంపతులు మండలి వెంకటకృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక కళాకారులను ఘనంగా సన్మానించి, వారికి నూతన వస్త్రాలు అందజేశారు. చైర్మన్ గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్యం కోసం మండలి వెంకటకృష్ణారావు చేసిన కృషి అపారమైంది అన్నారు. 1977లో దివిసీమను వణికించిన ఉప్పెన సమయంలో ఆయన చేసిన సేవలు నేటికీ ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు. నిస్వార్థంగా ప్రజల కోసం పనిచేసిన నేతగా కృష్ణారావు ఎల్లప్పుడూ గుర్తుండిపోతారు అని పేర్కొన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రి పిహెచ్సిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పశువైద్యశాలకు వాటర్ ట్యాంక్ బహూకరణ ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలోని పశు వైద్యశాల వద్ద ప్రస్తుతం ఉన్న పైప్‌లైన్ కనెక్ట్ చేసి త్రాగునీరు అందించుటకు వాటర్ ట్యాంక్ బహూకరించారు. దీని ద్వారా స్థానిక ప్రజలకు, పశు వైద్యశాలను ఆశ్రయించే రైతులు పరిశుభ్రమైన త్రాగునీటిని

పొందనున్నారు. మండల టీడీపీ అధ్యక్షులు తుమ్మల చౌదరీ బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ తోట కనకదుర్గ, నాటక అకాడమీ డైరెక్టర్ పైడిపాముల స్వప్న, డీసీ చైర్మన్ భాను ప్రకాష్, ఉప సర్పంచ్ శీలం శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సీతారామరాజు, మాజీ సర్పంచ్ ఆరుంబాక రవి, శ్రీకాకుళం %రాజా% చైర్మన్ రాంబాబు, టీడీపీ ప్రధాన కార్యదర్శి పరికే చలపతి, ఎస్సీ సెల్ అధ్యక్షులు దిరిసం వెంకట్రావు, కూటమి నేతలు కుంపటి చిట్టిబాబు, కొండవీటి శ్రీనివాస్, దాసం రామకృష్ణ, కొండవీటి నాని, కుంపటి సుబ్బారావు, తాడికొండ సాయి తేజ, పాటిబండ్ల నరేష్, గోపు రఘవరాజు, నాంజీ, మాదాసు వినయ్, కొండవీటి కోటి, మత్తి శ్రీను, జీళ్ల శ్రీనివాస్, కొండవీటి మున్నా, సుగ్గున పవన్ కుమార్, పావులూరి పసి, విజయ్, రాచూరి రాజశేఖర్, తోడేటి సుధీర్, తమ్మన ప్రసాద్, వీరబాబు మరియు కూటమి పార్టీల కార్యకర్తలు, గ్రామస్థులు, విద్యార్థులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన జడ్జి సుబ్రహ్మణ్యం

విశాలాంధ్ర-పెదపారుపూడి : గుడివాడ 11వ అదనపు జిల్లా జడ్జి జి. సుబ్రహ్మణ్యం పెదపారుపూడి తహశీల్దార్ కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ సంస్థ ప్రవేశపెట్టిన జాగృతి అనే పథకం కింద పేదలకు అందుతున్న ఉచిత సహాయాలు, న్యాయ సలహాలు గురించి ఆరా తీశారని ఇన్చార్జి తహశీల్దార్ కొడాలి యేసుపాదం శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎస్. శ్రీనివాసరావు, ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఓజీ ఎఫెక్ట్...పవన్ అభిమాని బలవన్మరణం

విశాలాంధ్ర, విస్సన్నపేట : పవన్ కల్యాణ్ నటించిన ఓజీ సినిమా నేపథ్యంలో పవన్ అభిమాని బలవన్మరణానికి గురయ్యారు. వివరాల్లోకి వెళితే... కృష్ణాజిల్లా గుడివాడ మండలం వసంతవాడకు చెందిన ఎ.అరవింద్(21) అనే యువకుడు ఉపాధి నిమిత్తం గత కొంతకాలంగా విస్సన్నపేటలో ఉంటున్నారు. విస్సన్నపేటలో శుక్రవారం పవన్‌కల్యాణ్ నటించిన ఓజీ సినిమా విడుదల కావటంతో ఆయన అభిమానులు గ్రామంలో విజయోత్సవ ప్రదర్శన నిర్వహించగా, అరవింద్ కూడా ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం సినిమా చూసి వస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు సినిమా నచ్చలేదని, ఫెయిల్ అయిందని వ్యాఖ్యలు చేయటంతో మనస్తాపానికి గురై, పురుగు మందు సేవించారు. గుర్తించిన కుటుంబసభ్యులు హుటాహుటిన నూజివీడు ప్రాంతీయ వైద్యశాలకు, మెరుగైన చికిత్సకు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ, శనివారం రాత్రి మరణించారు.

కేసుల పరిష్కారంలో జాప్యం వద్దు : ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : అనంతరం పోలీస్ స్టేషన్ లో నిర్వహిస్తున్న రికార్డుల్ని పరిశీలించి రికార్డుల నిర్వహణలో అప్డేట్‌గా ఉంచాలని, కేసుల పరిష్కారంలో జాప్యం వహించవద్దని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు సూచించారు. కృష్ణాజిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా శనివారం జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని గన్నవరం డిఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సిబ్బంది గౌరవ వందనం స్వీకరించిన అనంతరం పోలీస్ స్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాలను, స్టేషన్ లోపల గదులను పరిశీలించి సిబ్బంది పనిచేసే ప్రదేశం పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. నేరాల నియంత్రణకు రాత్రి పూట గస్తీని పెంచాలని, సిబ్బంది సంక్షేమంలో శ్రద్ధ చూపాలని తెలిపారు.

గన్నవరంలో రోడ్డు ప్రమాదంలో విలేకరి దుర్మరణం

విశాలాంధ్ర-గన్నవరం : సీనియర్ జర్నలిస్టు నేక్కలపు శ్రీనివాసరావు (52) శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గన్నవరం హెచ్‌సిఎల్ కంపెనీ ఎదురుగా జాతీయ రహదారిపై బైక్‌పై గన్నవరం వైపునకు వస్తున్న శ్రీనివాసరావును వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందిన వెంటనే గన్నవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆయన మృతదేహాన్ని సందర్శించి, ఆయన మృతికి తీవ్ర సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సీపీఐ గన్నవరం కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి సీపీఐ సీనియర్ నాయకులు కట్టవరపు విజయరావు, టిడిపి నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి బసవరావు, జాస్తి వెంకటేశ్వరరావు, వైస్ సర్పంచి పొలదుగు నాని, జాస్తి ఫణి, ఎంపీటీసీ పడమట రంగారావు మద్దినేని వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు ఎంపీపీ అనగాని రావి, తోట వెంకయ్య, తదితరులు నివాళులు అర్పించారు.

యువజన సమాఖ్యలో పొట్రు చురుకైన పాత్ర

3వ వర్ధంతిలో జి కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ: యువజన సమాఖ్య నాయకుడుగా పొట్రు వెంకటరమణ చురకైన పాత్ర పోషించారని సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు గుర్తు చేశారు. 36వ డివిజన్‌లో శనివారం వెంకటరమణ మూడో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జి.కోటేశ్వరరావు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ వెంకటరమణ తన తండ్రి పొట్రు వెంకటేశ్వరరావు,తల్లి సుబ్బులమ్మ, స్ఫూర్తితో అఖిల భారత విద్యార్థి సమాఖ్యలో చేరి విద్యార్థి నాయకుడిగాను, అఖిల భారత యువజన సమాఖ్య నాయకుడిగా ఎదిగి పార్టీ నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొనేవారని గుర్తు చేశారు, అనంతరం కుటుంబ సభ్యులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని పార్టీ కార్యదర్శి కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మూలి సాంబశివరావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, తూనం వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు పరామర్శ...

నగర కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా విశేషమైన సేవలందించిన పార్టీ సీనియర్ నాయకుడు పొట్రు వెంకటేశ్వరరావును పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

గాంధీ ఆశయాలకు అనుగుణంగా సేవలందించాలి

-హైకోర్టు జడ్జి రవినాథ్ తిల్హరి

విశాలాంధ్ర-విజయవాడ: అహింస, శాంతియుత మార్గాల్లో దేశ స్వాతంత్ర్యాన్ని అందించిన మహాత్మగాంధీ ఆశయాలకు అనుగుణంగా సేవలందించాలని హైకోర్టు న్యాయమూర్తి రవినాథ్ తిల్హరి సూచించారు. ది బెజవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి ఉత్సవ్‌కు ముఖ్య అతిథులుగా కృష్ణా జిల్లా పోర్టుఫోలియో హైకోర్టు న్యాయమూర్తి రవినాథ్ తిల్హరి, హైకోర్టు న్యాయమూర్తి నినాల జయ సూర్య, జిల్లా జడ్జి గుట్టల గోపి, మెట్రోపోలీటన్ సెషన్స్ జడ్జి సత్యానంద్ శనివారం హాజరయ్యారు. బార్ అసోసియేషన్ హాల్ ఆవరణలో ఏర్పాటు చేసిన శబరిమతి ఆశ్రమాన్ని, ఫోటో ఎగ్జిబిషన్ జడ్జీ తిల్హరీ ప్రారంభించారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే భాషా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు గాంధీ లా మంచి సంకల్పాలు తీసుకోవాలని, ఆయన కాంక్షించిన సమాజాభివృద్ధి మార్గదర్శకాలు పాటించాలని పిలుపునిచ్చారు. ఆయన పేరుతో ఉత్సవాలు నిర్వహించాలని తలపెట్టడం అభినందనీయం కొనియాడారు. ఈ సందర్భంగా గాంధీకి ఇష్టమైన పాటను వీక్షకులకు వినిపించారు. న్యాయ మూర్తి జయ సూర్య మాట్లాడుతూ దేశ భక్తుల త్యాగాలు సమాజానికి అవసరమని వాటిని మరచిపోకుండా ఇలాంటి కార్యక్రమాలు విజయవంతంగా జరుపుకోవడం మంచిదన్నారు. జిల్లా జడ్జి గుట్టల గోపి మాట్లాడుతూ గాంధీ చూపిన మార్గాన్ని పాటించాలని అన్నారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా న్యాయమూర్తులకు సత్కార కార్యక్రమం ఆశీర్వచన పూర్వకంగా నిర్వహించారు. లైబ్రరీ కార్యదర్శి కంచర్ల త్రినాథ్ స్వాగతం పలుకగా, ఉపాధ్యక్షుడు పి. శ్రీనివాస రావు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ లో ఉన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

శ్మశానవాటికలోకి అక్రమంగా మట్టి తరలింపు

విశాలాంధ్ర-విజయవాడ: ఎన్నో తరాలుగా ఉన్న స్మశానవాటికలోకి అక్రమంగా మట్టిని తరలించి వినియోగంలోకి లేకుండా చేయాలని కొంతమంది కుట్రలు చేస్తున్నారని విశ్వబ్రహ్మణ రుద్రభూమి అభివృద్ధి కమిటీ నాయకులు కోడూరు కిషోర్‌బాబు, లాల్, ప్రసాద్, చుండూరు శ్రీనివాస్ ఆరోపించారు. నిడమానురు పంచాయితీ పరిధిలోని రామానగర్ కాలనీలో చెరువు అభివృద్ధి పేరుతో గత కొంతకాలంగా పెద్దఎత్తున మట్టిని తమ స్మశానవాటికలోకి తరలిస్తున్నారని తెలిపారు. దీంతో సదరంగా ఉండవల్సిన స్థలం మొత్తం మట్టిదిబ్బలతో నిండిపోయిందని తెలిపారు. దురదృష్టవశాత్తు ఎవరైన చనిపోతే పాతిపెట్టుటకు సమాధి త్రవ్వితే నీరు చేరుకోవడంతో తీవ్ర ఆటంకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించమని స్థానిక సర్పంచ్, నాయకులకు, అధికారులకు అనేకమార్లు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. పలు దఫాలు తమ ప్రాంతానికి పర్యటనలకు వస్తున్న స్థానిక ఎమ్మేల్యే దృష్టికి తీసుకెళ్లడం జరిగందని తమకు ఎటువంటి న్యాయం జరగలేదని, చివరకు ప్రజాసమస్యల పరిష్కర వేదికలో కూడా అర్జీని పెట్టిన ఉపయోగం లేదన్నారు. తమకు ఎంతో ఆటంకంగా ఉన్న సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

టిడ్కో ఇళ్లు ఎప్పుడు ఇస్తారు?

విశాలాంధ్ర-తిరువూరు: పట్టణంలో 1537 టిడ్కో ఇళ్లు ఇప్పటికీ లబ్ధిదారులకు అందకపోవడం పేద ప్రజల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2018లో నాటి ప్రభుత్వం లబ్ధిదారుల వద్ద నుండి రూ.25,000, రూ.50,000, రూ.75,000లను వసూలు చేసుకుని నేటికీ గృహాలు ఇవ్వకపోవడం దారుణమని, ఇది ప్రజలతో ఘోర మోసమని ఆయన అన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్ కె నాగుల్‌మీరా మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం నిదర్శనమే ఇప్పటివరకు లబ్ధిదారులకు టిడ్కో గృహాలు అందకపోవటం అని అన్నారు. పేద ప్రజల కష్టార్జిత డబ్బులను వసూలు చేసి ఇంతకాలం నిరాధారులుగా వదిలేయడం నిశితంగా తప్పు అని, దీనిపై తక్షణం చర్యలు తీసుకుని గృహాలు లబ్ధిదారులకు అప్పగించకపోతే సీపీఐ బహిరంగ ఆందోళనలు తప్పనిసరిగా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రతి లబ్ధిదారికి హక్కుగా గృహాలు అందే వరకు పోరాటం కొనసాగుతుందని మాలపాటి ఉదయ్, నాగుల్ మీరా ప్రకటించారు.

డీఎస్సీ సాధించిన వారికి కలెక్టర్ సత్కారం

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ విజయవాడ వారి ఆదేశానుసారం కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో డిఎస్సి -2025 పరీక్షలకు హాజరైన 127 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఆన్లైన్ మరియు ఆఫ్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వడం జరిగింది. ఉచిత శిక్షణ పొందిన 127 మందిలో 13 మంది విద్యార్థిని విద్యార్థులు డిఎస్సి-2025 లో ఉద్యోగాలు సాధించారు. దీనిపై వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి దమేష్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా తరుపున 26వ తేదీన జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ ఉచిత శిక్షణ ద్వారా ఉద్యోగాలు సాధించిన 6 గురు విద్యార్థులను శాలువాలతో సత్కరించి వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఎస్. హనుమ, జిల్లా కార్యాలయ సిబ్బంది మరియు వసతిగృహ సంక్షేమాధికారులు పాల్గొని ఉద్యోగాలు సాధించిన వారికి అభినందనలు తెలిపారు.

ఓడి మూగబోయిన చదువులమ్మ

యడ్లపాడు లూథరన్ పాఠశాల మూసివేత



విశాలాంధ్ర-యడ్లపాడు: మారిన పరిస్థితులు, వ్యూహాత్మక చదరంగం, వ్యాపారం గా మార్చే విధానాలు, వంటి వివిధ కారణాలతో 70 వసంతాల పూర్వం యడ్లపాడులో ఎడ్లపాడు కమిటీ పాఠశాల పేరుతో, గ్రామస్తుల దాతృత్వంతో యడ్లపాడు లోని నేటి లూథరన్ ఉన్నత పాఠశాల ఆవిర్భవించింది. 21 మంది ఎయిడెడ్ పోస్టులు, దాదాపు 700 మంది విద్యార్థులతో నియోజకవర్గం లోనే ప్రముఖ స్థానంలో నిలిచిన ఈ పాఠశాల నేడు విద్యార్థులు లేరన్న కారణంగా మూసివేయాలని విద్యాధికారులు ఆదేశించిన వైనం పలువురికి శరాఘాతం లా మారింది. నాడు స్థల, గదుల, గ్రౌండ్ దాతలుగా పలువురు చేసిన త్యాగాలు నేడు నిరుపయోగంగా మారాయన్నది పలువురి వేదన. 1953, 54 లో కమిటీ పాటశాల గా మొదలై నిర్వహణ భారం కావడంతో ఏఈఎల్సీ చర్చి వారికి గ్రామస్తులే స్వాధీనం చేశారు.

స్వచ్ఛత అనేది ఒక జీవన విధానంగా మార్చుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : స్వచ్ఛత అనేది కేవలం ఒక ప్రచారం కాకుండా ఒక జీవన విధానంగా ప్రతి ఒక్కరు మార్చుకోవాలని డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్ఎం) మోహిత్ సోనాకియా సూచించారు. దేశవ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవ ప్రచారంలో భాగంగా శుక్రవారం రైల్వే ఆడిటోరియంలో సాంస్కృతిక ఉత్సవం-వ్యర్థాల నుండి కళల ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమం సృజనాత్మకత, పనితీరు సమాజ భాగస్వామ్యం ద్వారా వ్యర్థాల నుండి కళ అనే సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిల్లలు, భారత్ స్కౌట్స్ & గైడ్స్, వివిధ రైల్వే యూనిట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి, వీరందరూ పరిశుభ్రత- పర్యావరణ పరిరక్షణ పట్ల తమ ప్రతిభను, నిబద్ధతను ప్రదర్శించారు. ఈ సందర్భగా డిఆర్ఎం మాట్లాడుతూ స్వచ్ఛత సందేశాన్ని వ్యాప్తి చేయడంలో పిల్లల ప్రయత్నాలను అభినందించారు. చెత్త రహిత వాతావరణాన్ని సృష్టించడంలో పౌరులతో పాటు పిల్లలు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి అవగాహన ప్రచారాలు, పోటీలు, ర్యాలీలు ద్వారా చైతన్యం తీసురావాలన్నారు. ప్రతి ఒక్కరు పరిశుభ్రమైన భవిష్యత్తు కోసం సమిష్టి బాధ్యత తీసుకొవాలని సూచించారు. పరిశుభ్రమైన, పచ్చని భారతదేశం కోసం మా ఉమ్మడి దార్శనికతను ప్రతిబింబిస్తుందన్నారు. ఏడిఆర్ఎం శ్రీనివాసరావు కొండా (ఆపరేషన్స్) మాట్లాడుతూ పరిశుభ్రతా కార్యక్రమాలలో నిరంతర ప్రజల భాగస్వామ్యం ఉండాలన్నారు. పరిశుభ్రత కేవలం ప్రచార సమయాలకే పరిమితం కాకూడదన్నారు. ప్రతి పౌరుడు రోజువారీ అలవాటుగా మారాలి. అప్పుడే మనం మన పరిసరాలను నిజంగా పరిశుభ్రమైన, ఆకుపచ్చ, అందమైన ప్రదేశాలుగా మార్చగలం అన్నారు. అనంతరం విద్యార్థులు విస్మరించిన పదార్థాల నుండి సృష్టించబడిన వినూత్న రచనలను ప్రదర్శించడంతో "వేస్ట్ టు ఆర్ట్" ఎగ్జిబిషన్ చాలా ప్రశంసలను పొందింది. వారి సృజనాత్మకత వ్యర్థాలను స్ఫూర్తిదాయకమైన కళాత్మక వ్యక్తీకరణలుగా మార్చింది, ఇది స్థిరత్వ తత్వాన్ని ప్రతిబింబిస్తుంది. కేంద్రీయ విద్యాలయ నంబర్ 1 మొదటి బహుమతిని గెలుచుకోగా, ఐకాన్ పబ్లిక్ స్కూల్ పోటీలో రెండవ, మూడవ బహుమతులను గెలుచుకున్నారు. డీజిల్ లోకో షెడ్ (డిఎల్ఎస్) వందే భారత్ రైలు నమూనా, జీవితకాల గుర్రం, ఐకానిక్ గోదావరి రైల్వే వంతెన, కృష్ణ వంతెనతో సహా పూర్తిగా స్క్రాప్ మెటీరియల్‌తో తయారు చేయబడిన పెద్ద ఎత్తున నమూనాల అద్భుతమైన సేకరణను ప్రదర్శించింది. అదేవిధంగా, కాకినాడ క్యారేజ్, వ్యాగన్ వర్క్‌షాప్ డిపో చరఖా, నెమలి, పిల్లి వంటి క్లిష్టమైన కళాకృతులను మరియు రైల్వే స్క్రాప్ నుండి రూపొందించిన ఇతర సృజనాత్మక నమూనాలను ప్రదర్శించారు.

రోడ్డు నిర్మాణం చేపడితే చూస్తూ ఊరుకోం

సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల డేవిడ్

విశాలాంధ్ర-ఏ కొండూరు: మండలంలోని కంభంపాడు జిల్లా పరిషత్ ఆట స్థలంలో రోడ్డు నిర్మాణం చేపడితే సీపీఐ చూస్తూ ఊరుకోదని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల డేవిడ్ అధికారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణం చేపడుతున్న స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ పూర్వం దాతలు విలువైన భూమిని జిల్లా పరిషత్ పాఠశాలకు ఆట స్థలం గా ఇవ్వడం జరిగిందని తెలిపారు. అయితే కొంతమంది భూ స్వాముల పొలంలోకి ఏకంగా దారి వేయడానికి ప్రభుత్వ నిధులు రూ 25 లక్షలు విడుదల చేయించామని చెప్పడాన్ని తప్పుబట్టారు. జడ్పీ ఆటస్థలం మధ్య నుండి రోడ్డు నిర్మాణంతో విద్యార్థులకు ఆటస్థలంలో ఆడుకోవడానికి అనువుగా ఉండదని అన్నారు. గిరిజనుల కోసమేనని సాకుగా చూపించి సిసి రోడ్డు వేస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. ఎటువంటి తీర్మానాలు లేకుండా జిల్లా పరిషత్‌కు ఎలా ప్రవేశ పెట్టారని అధికారులను నిలదీశారు. రోడ్డు నిర్మాణాన్ని సీపీఐ ప్రజా సంఘాలు విద్యార్థి సంఘాలు మరియు పూర్వ విద్యార్థులతో అడ్డుకుంటామని, అవసరమైతే జిల్లా కలెక్టర్‌ను కలిసి పూర్తిస్థాయిలో వివరిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ముచ్చింతల వెంకటేశ్వరరావు సీపీఐ సీనియర్ నాయకులు దాడి ఆదినారాయణ, గొల్లమందల, సీపీఐ గ్రామ కార్యదర్శి సంగీతరావు తదితరులు పాల్గొన్నారు

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నిరంతరం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. నగర పర్యాటల్లో భాగంగా కమిషనర్ శనివారం బందర్ రోడ్డు, వెటర్నిటీ హాస్పిటల్, బెంజ్‌సర్కిల్, నిర్మల కాన్వెంట్ జంక్షన్, రమేష్ హాస్పిటల్ జంక్షన్, ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వాహణలో ఎలాంటి లోపం ఉండరాదని, ప్రతిరోజు రోడ్లు పరిశుభ్రంగా ఉంచాలని, నగర పరిశుభ్రతలో రాజీ ఉండరాదని, రోడ్లులో డివైడర్ల వద్ద కూడా పరిశుభ్రంగా ఊంచాలని, ప్రతిరోజు ఇంటి వద్దనే వ్యర్థాలను సేకరించాలని, రోడ్డుపైన వ్యర్థాలు ఉంచరాదని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్వచ్ షెహార్ జోడి నగరాలతో మెమొరండమ్ ఆఫ్ అండర్సాటిండింగ్

నగరపాలక సంస్థ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు స్థానిక వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో అడిషనల్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ స్వచ్ షెహార్ జోడి నగరాలు మెమొరండమ్ ఆఫ్ అండర్సాండింగ్ చేసుకున్న నేపద్యంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ ప్రవేశపెట్టిన నేపద్యంలో స్వచ్ఛ షెహార్ జోడి 2025లో భాగంగా, స్వచ్ఛ సర్వేక్షన్ 2024లో ఉత్తమమైన స్థానాల్లో ఉన్న నగరాలను మెంటర్ సిటిగా గుర్తించి వారికి స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకులో తక్కువ స్థానాల్లో ఉన్న సిటీలను మెంటీ సిటీగా, మెంటార్ సిటీ మెంటీ సిటి రెండు కలిపి స్వచ్ షెహార్ షహార్ జోడిగా 100 రోజుల పాటు స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని, స్వచ్ఛతలో మెరుగైన మార్పులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబుశ్రీనివాస్, నర్సాపూర్ కమిషనర్ ఎం.అంజయ్య, సామర్లకోట కమిషనర్ ఏ.శ్రీవిద్య, ఆకివీడు కమిషనర్ జి.కృష్ణమోహన్, చింతలపూడి కమిషనర్ ఏ.రాంబాబు, గొల్లప్రోలు ఏఈ మహమ్మద్ ఆలీషా పాల్గొన్నారు.

6వ రోజు భక్తుల పూజలందుకున్న అమ్మవారు

విశాలాంధ్ర - గుడివాడ : విజయదశమిని పురస్కరించుకుని దేవి శరన్నవరాత్ర మహోత్సవాల 6వ రోజు శనివారం అమ్మవారి దేవాలయాలు భక్తులతో కళకళలాడుతున్నాయి.

శ్రీభీమేశ్వరస్వామి వారి దేవస్థానంలో...

స్థానిక బంటుమిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ భీమేశ్వరస్వామివారి దేవస్థానములో జరుగుతున్న శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవాలల్లో భాగంగా శనివారం అమ్మవారు శ్రీకాత్యాయనిదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటి చైర్మన్ పట్టపు చిన్న, కమిటి సభ్యులు, కార్యనిర్వహణాధికారి గోపాలరావుల నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

శ్రీగౌరీశంకరస్వామి దేవస్థానంలో...

స్థానిక గౌరీశంకరపురంలో వేంచేసియున్న శ్రీ గౌరీశంకర స్వామి వారి దేవస్థానము నందు శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవములలో భాగంగా శనివారం లలితా త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయంలో మహా చండీహోఈ కార్యక్రమాల్లో దేవస్థానము కమిటి చైర్మన్ నెరుసు బోసు, ఇఓ కందుల వెణుగోపాలరావు, పట్టణ ప్రముఖులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీవేణుగోపాలస్వామి వారి దేవస్థానములో...

గుడివాడలో వేంచేసియున్న శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానములో శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవలల్లో భాగంగా శ్రీవైష్ణవిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మ వార్కి విశేషపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటి చైర్మన్ అంగడాల సతీష్, కమిటి సభ్యులు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కెవి గోపాలరావు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానములో...

గుడివాడలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవస్థానములో శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవలల్లో భాగంగా సంతానలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మ వార్కి విశేషపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు లింగం చిట్టిబాబు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కెవి గోపాలరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వమండలంలోని కూచిపూడి గ్రామపంచాయతీ లో జాతీయ కీటక జనత వ్యాధుల నివారణలో భాగంగా మొవ్వ వైద్యాధికారిణి డాక్టర్ సిహెచ్ రాజేశ్వరి సూచనల మేరకు వర్షాలు ఎక్కువగా పడుతున్నఈసీజన్లోవ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు లోతట్టు ప్రాంతమైన మూడవ వార్డు (పక్షుల తోట) లో టెక్నికల్ మలాథియాన్ ఫాగింగ్ మిషన్ ద్వారా శుక్రవారం రాత్రి గ్రామంలో ఫాగింగ్ చేయించారు. ఈ కార్యక్రమం ఆరోగ్య కార్యకర్త కె రామాంజనేయులు పర్యవేక్షణలోకొనసాగగా పంచాయతీ మూడవ వార్డు సభ్యుడు కాకర్ల శ్రీనివాసరావు పంచాయతీ సిబ్బంది పడవల కుమార్ రాజా, సురేష్ తదితరులు సహకరించారు.

వైభవంగా పూజలు

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేతశ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా కొనసాగుతున్న శరన్నవరాత్రి దసరా మహోత్సవాలు వేడుకలో భాగంగా ఆరవ రోజైన శనివారం ఆరుగురు బాల ముత్తైదువులకు ఉభయ దాతలు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆశీస్సులు తీసుకున్నారు. శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారిని శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా దేవాలయ పాలకమండలి సభ్యుల చొరవతో అలంకార ఉభయ దారుల పర్యవేక్షణలో అర్చక స్వాములు పెనుమూడి పూర్ణ చంద్రశేఖర శర్మ, పెనుమూడి సతీష్ కుమార్ శర్మ, పెనుమూడి సుబ్రహ్మణ్య శాస్త్రి (బాబీ) ల ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించారు.

లలితా త్రిపురసుందరిగా అమ్మవారు

విశాలాంధ్ర-విస్సన్నపేట : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం కనకదుర్గ అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా అలంకరించి, భక్తులు పూజించారు. స్థానిక కనకదుర్గ దేవాలయం, పుట్రేల మారెమ్మ దేవాలయం, విస్సన్నపేట చంద్రశేఖరస్వామి దేవాలయాల్లో పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామ కూడళ్లలో, విస్సన్నపేట గ్రామంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన నవరాత్రి పందిళ్ల వద్ద భక్తులు పెద్దఎత్తున పూజలు చేపట్టారు.

ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-పమిడిముక్కల: రైతులు తమ పంట ఈక్రాప్ వేగవంత చేయాలని ఆర్డీవో హేలా షారూన్ అన్నారు. శనివారం తాడంకి పరిధిలోని పంట పొలాల ఈ-క్రాప్ ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఈ-క్రాప్ నమోదు చేయుటకు తగినంత సిబ్బంది ఉన్నారని రైతులు తమ పంట ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఈ నెల 30 తో నమోదు ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నవీన్ కుమార్ రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో ఖరీఫ్ పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారి అధికారి

విశాలాంధ్ర-గన్నవరం : ఈ పంట నమోదు ప్రక్రియను, సూరంపల్లి ముస్తాబాద్, సవారిగూడెం కేసరపల్లి గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి గన్నవరం కే శివప్రసాద్ గారు పరిశీలించారు. ఈనెల 30వ తేదీ కల్లా ఈ పంట నమోదును పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి గన్నవరం వారు అన్నారు. మండలంలో ఇప్పటివరకు 80 శాతం ఈ పంట నమోదు పూర్తయిందని, మిగిలిన 20 శాతం నమోదును త్వరగా పూర్తి చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకు సూచించడం అయినది. రైతు సోదరులు తమ ఈ పంట నమోదుకి సంబంధించి సందేహాలు

ఏఎల్ బీఈడీ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: స్థానిక లాడ్జిసెంటర్‌లోని ఏఎల్ బీఈడీ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు శనివారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. కళాశాలలో బీఈడీ, ఎంఈడీ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున వేడుకలకు హాజరై ఆప్యాయత అనురాగాలను పంచుకున్నారు. కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు పార్లమెంటు సభ్యులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్లాటినం జూబ్లీ పైలాన్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాదాసు ఎస్తేరు సునీల తదితర అధ్యాపక బృందం వేడుకల కమిటీ సభ్యులు కేంద్రమంత్రి పెమ్మసానికి పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కళాశాల పూర్వ విద్యార్థి, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్

లావు రత్తయ్య, మాజీ కేంద్ర మంత్రి జెడి శీలం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య కె.రత్నశీలమని, ఏఈఎల్‌సి అడ్మినిస్ట్రేటర్ జస్టిస్ జోసఫ్ పి.ఎస్, సెక్రెటరీ టు కంట్రోలర్ ఏఎల్‌సి చర్చి ఎన్ జేసురత్న కుమార్, సెంట్రల్ గుంటూరు సినాడ్ బిషప్ మోహన్, డాక్టర్ జి.పాల్ రత్నాకర్, ఏసీ కళాశాల ప్రిన్సిపల్, లా కళాశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థు లకు నిరంతర శిక్షణ ఎంతో అవసరం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులపై వేల కోట్ల రూపాయల ఖర్చు పెడుతున్నా ఉపాధ్యాయులలో దాగి ఉన్న బోధన పఠనకు మరింత సాధన చేకూర్చేందుకు శిక్షణలు నిర్వహించకపోవడం దురదృష్టకరమ న్నారు. మాజీ కేంద్ర మంత్రి జెడి శీలం మాట్లాడుతూ చర్చిల నిర్వహణలో సంస్కరణలు రావాలని, ఈ సంవత్సరంలోనే చర్చిలకు అను బంధంగా ఉన్న విద్యాసంస్థలు మరింతగా విద్యాభివృద్ధిని సాధిస్తాయనీ అన్నారు. కార్యక్రమంలో భాగంగా కళాశాలకు సంబంధించిన సావనీర్‌ను ఆవిష్కరించారు.

పవన్, నాగబాబు నోరు మెదపాలి: మేడా

విశాలాంధ్ర- గుంటూరు వైద్యం : నాగబాబు, పవన్ కళ్యాణ్‌లకు అందమైన జీవితాన్ని ఇచ్చిన మెగాస్టార్ చిరంజీవిని అసెంబ్లీ సాక్షిగా అవమానించిన బాలకృష్ణను ఖండించలేకపోయారని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆనాడు నందమూరి తారక రామారావుని హోటల్ వైశాయి వద్ద సొంత కుటుంబం సాక్షిగా చెప్పులు, వాటర్ బాటిళ్లతో దాడి చేసి అవమానించిన విధంగానే నేడు చిరంజీవికి అసెంబ్లీ సాక్షిగా అవమానించారన్నారు. చిరంజీవి ప్రతిష్ట కన్నా నాగబాబు, పవన్ కళ్యాణ్‌లకు రాజకీయ పదవులు ముఖ్యంగా మారాయని ఆరోపించారు. ప్రతి మెగాస్టార్ చిరంజీవి అభిమాని ఈ అవమానాన్ని ముక్త కంఠంతో రాజకీయాలకు అతీతంగా ఖండించాలని అన్నారు. నాగబాబు, పవన్‌లకు చిరంజీవిపై ప్రేమ కన్నా బాలకృష్ణతో భయమే వెంటాడుతున్నట్టు కనబడుతుందని విమర్శించారు. రాజకీయాలు నేడు ఉంటాయి.. రేపు పోతాయి కానీ అన్నయ్య చిరంజీవి శాశ్వతం అనే లాజిక్‌ను వారు ఎలా మిస్ అవుతున్నారని ప్రశ్నించారు. ఎన్టీఆర్‌ను దురదృష్టం వెంటాడితే చిరంజీవిని అదృష్టం అనే రూపంలో శాపం వెంటాడుతుందా అనే అనుమానాన్ని వ్యక్తంచేశారు. ఇప్పటికైనా నాగబాబు పవన్ కళ్యాణ్‌లు నోరు మెదపాలని సూచించారు.

నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ జిల్లా ప్రెసిడెంట్‌గా మున్నంగి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు జిల్లా నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ప్రెసిడెంట్‌గా మున్నంగి వివేకానంద రెడ్డి నియమిస్తున్నట్లు రాష్ట్ర నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ శ్యామల జయ కోటిరెడ్డి వెల్లడించారు. శనివారం నాడు

కొరిటపాడు లోని రాష్ట్ర నేషనల్ హ్యూమన్ రైట్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జిల్లా చైర్మన్‌గా వివేకానంద రెడ్డి, ఉపాధ్యక్షులు గా గోపిరెడ్డి, సయ్యద్ యూనస్, సోషల్ మీడియా కన్వీనర్‌గా చెరుకూరి శ్రీనివాసరావు లకు వివేకానంద రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్‌గా ఎన్నికైన వివేకానంద రెడ్డి మాట్లాడుతూ మానవ హక్కులను కాపాడేందుకు గుంటూరు జిల్లా కమిటీ కృషి చేస్తుందని తెలిపారు.

జ్యోతికి ఉద్యోగ కల్పన

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: అంధత్వంతో బాధపడుతూ కుమారుని పోషిం చుకుంటూ జీవనం సాగిస్తున్న జ్యోతికి ప్రభుత్వం ఉద్యోగ కల్పించింది. పాత గుంటూరులో నివాసం ఉంటున్న జ్యోతికి మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో ప్రభుత్వ

సర్వజన ఆసుపత్రిలో పారిశుధ్య విభాగంలో ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ కల్పన చేస్తూ జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందించారు. దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకులు డి.దుర్గాభాయి మాట్లాడుతూ జ్యోతి ఎనిమిది సంవత్సరాల కుమారుడు కొద్ది రోజుల క్రితం నిమోనియా వ్యాధికి గురికాగా జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందేటట్లు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ భగత్‌సింగ్ జయంతి

విశాలాంధ్ర-తెనాలి : ఏఐఎస్ఎఫ్ ఆధ్వ ర్యంలో ఘనంగా జయంతి వేడుకలు జరిగాయి. ఆయన జయంతి సందర్భంగా శివాజీ చౌక్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం వెంకటేష్ మాట్లాడుతూ దేశం కోసం యువతకోసం భగత్‌సింగ్ ఎన్నో పోరాటాలు చేశారని స్వతంత్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఏకైక వ్యక్తి అని కొనియాడారు. నేటి యువత ఆయన్ని ఆదర్శంగా తీసుకొని సమస్యల పట్ల పోరాట స్ఫూర్తితో ముందుకు నడవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విద్యార్థులను ఇబ్బంది పెడుతుందని గుర్తుచేశారు. విద్యాశాఖమంత్రి నారా లోకేష్ పాదయాత్రలో 117,118 జీఓలను అధికారంలోకి రాగానే వంద రోజుల్లో రద్దు చేస్తానని చెప్పి 18 నెలలు అవుతున్నా మాట నిలబెట్టుకోవ డంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. మెడికల్ కాలేజీల విషయంలో కూడా ప్రభుత్వం పిపిపి విధానాన్ని తీసుకువచ్చారని, దీన్ని వెంటనే ఉపసంహరిం చుకోవాలని లేకపోతే పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. నిరు ద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, రాష్ట్రాన్ని మంచి మార్గంలో నడిపించే బాధ్యత కూటమి ప్రభుత్వం చేతుల్లో ఉందని గుర్తు చేశారు. ఇప్పటికైనా విద్యార్థుల సమస్యలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చెరుకుమల్లి సింగారావు, బొల్లిముంత కృష్ణ మాస్టారు, తుంగ బాలస్వామి, సాయి, కోట్లు, తేజ, యశ్వంత్, మణి, భాను, చక్రి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటలతో మానసిక ఒత్తిడి దూరం: సృజన్ కుమార్

విశాలాంధ్ర- గుంటూరు వైద్యం : గుంటూరు బీఆర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ (ఎస్జీఎఫ్) అండర్-17,19 ఉషూ పోటీల్లో అమరావతి రోడ్డు చైనీస్ కుంపు కోచింగ్ సెంటర్ విద్యార్థులు అండర్-19, ఏసీ

కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థిని దాసరి సాహితీ అండర్-17, సెయింట్ ఇగ్నేషియస్ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థిని ఎం.లక్ష్మీ ప్రసన్న, కెకెఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థిని వై.జస్వంత్ లు విజేతలుగా నిలిచారు. వీరందరూ ఉషూ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ కు ఎంపికైనట్లు కోచ్ ఎం. కిరణ్ కుమార్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థినీలను రాష్ట్ర కార్యదర్శి బండి నరసింహారావు అభినందించారు. అనంతరం సంజీవిని హాస్పటల్ షుగర్ వైద్య నిపుణులు డాక్టర్ ఎ.సృజన్ కుమార్ మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలన్నారు. ఆటల ద్వారా వారికి మానసిక ఒత్తిడి తగ్గుతుందని, చదువుల్లో కూడా ముందుండాలని అన్నారు. గెలుపొందిన విద్యార్థినిలకు డాక్టర్ సృజన్ కుమార్ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉషూ ఆటలో శిక్షణ తీసుకోవాలనుకున్నవారు ఆంజనేయ పేట 3వ లైను లో ఉన్న కోచింగ్ సెంటర్ ను లేదా 9100639089 నెంబర్ ను సంప్రదించాలని కోచ్ కిరణ్ తెలిపారు.

ఆంజనేయులు మరణం బీసీలకు తీరని లోటు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు, రాష్ట్ర వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు అకాల మరణం బడుగు బలహీన వర్గాలకు తీరని లోటు అని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ అన్నారు. శనివారం స్థానిక చుట్టుగుంటలోని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో కుమ్మర క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో తన్నీరు ఆంజనేయులు సంస్మరణ సభ నిర్వహించారు. సభకు క్రాంతికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సభలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు, సంఘం రాష్ట్ర నాయకులు కన్నా మాస్టారు, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ముప్పాన వెంకటేశ్వర్లు, పోలేపల్లి మహేష్, కోలా అశోక్, రామకృష్ణ, ఉప్పుటూరు పేరయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో బీసీ కులంలో జన్మించి కష్టాన్ని నమ్ముకుని అంచలంచెలుగా ఎదిగిన గొప్ప వ్యక్తి ఆంజనేయులు అని కొనియాడారు. తనకు భగవంతుడు అన్ని సమకూర్చినప్పటికీ తన వడ్డెర కులంతో పాటు బీసీ వర్గాల ఆర్థిక సామాజిక రాజకీయ హక్కుల పోరాటంలో తన వంతు పాత్ర పోషించిన వ్యక్తి ఆంజనేయులును అని, ఆయన మరణాన్ని బీసీ సంఘాలు జీర్ణించుకోలేకపోతున్నాయి అన్నారు. ఆయన ఆశయ సాధన దిశగా తామంతా బీసీల హక్కులపై పోరాడుతామన్నారు. ఆంజనేయులు ఆత్మకు శాంతి చేకూరాలని అలాగే ఆయన కుటుంబానికి అన్ని విధాల ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం నాయకులతో పాటు, ఏపీ బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో 'వరల్డ్ హార్ట్ డే వాకథాన్'

విశాలాంధ్ర- గుంటూరు వైద్యం : వరల్డ్ హార్ట్ డే సందర్భంగా గుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సమాజంలో గుండె ఆరోగ్యం పట్ల అవగాహన పెంచేందుకు 'వరల్డ్ హార్ట్ డే వాకథాన్' శనివారం ఉదయం చేపట్టారు. సినీ నటి శివాని నాగారం ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కిమ్స్ శిఖర హాస్పటల్ నుండి బెస్ట్ ప్రైస్, బస్టాండ్ మీదుగా బిఆర్ స్టేడియం వరకు కొనసాగింది. బెస్ట్ ప్రైస్ వద్ద ఫ్లాష్ మాబ్ జరిగింది. ఈ సందర్భంగా నటి శివాని మాట్లాడుతూ వరల్డ్ హార్ట్ డే పురస్కరించుకొని కిమ్స్ శిఖర హాస్పిటల్‌కు రావడం సంతోషంగా ఉందన్నారు. యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం కిమ్స్ శిఖర కార్డియాక్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ నాగశ్రీ హరిత మాట్లాడుతూ పండుగలను మనం ఎలాగైతే జరుపు కుంటామో అలాగే గుండె జబ్బుల నివారణ కోసం హార్ట్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే 80 శాతం గుండె జబ్బులు రాకుండా చేయవచ్చన్నారు. గుండె డ్యామేజ్ అయిన తర్వాత దానిని తిరిగి రికవరీ చేయ

లేమని, ఈ నేపథ్యంలో ముందస్తుగా గుర్తించి డాక్టర్‌ను సంప్రదిస్తే 100 శాతం రికవరీ చేయవచ్చన్నారు. ఒత్తిడితో కూడిన జీవన సరళిలో గుండె జబ్బులు కేవలం వృద్ధులకే కాకుండా యువతలో కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు వెల్లడించారు. శారీరక శ్రమ, అసమతుల్య ఆహారం, మానసిక ఒత్తిడి యువతలో గుండె సమస్యలకు కారణమవుతున్నాయని, చిన్న చిన్న స్కానింగ్‌లు, పరీక్షలతో ముందుగానే ప్రమాద సూచికలను గుర్తించవచ్చని తెలిపారు. కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం, ఉప్పు, చక్కెర తక్కువ తీసుకుంటూ, కొవ్వును తగ్గించుకోవడం, వ్యాయామం, స్మోకింగ్, మద్యపానాన్ని పరిమితం చేయడం, యోగా, ధ్యానం చేయడం వల్ల గుండెపై ఒత్తిడిని తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ.శివ ప్రసాద్ మాట్లాడుతూ హృదయ ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం, రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు చేసుకోవ డం వల్ల గుండె జబ్బులను రాకుండా అరి కట్టవచ్చని తెలిపారు. న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణ్ మాట్లాడుతూ పుట్టిన దగ్గర నుండి చనిపో యే వరకు మన కోసం పని చేసేది గుండె మాత్ర మేనన్నారు. జీవన సరళలో ఇటీవల వచ్చిన మార్పు ల వల్ల చిన్న వయసులోనే అనేకమంది గుండె జబ్బులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుండె అనారోగ్యానికి గురైనప్పుడు తీసు కునే ట్రీట్మెంట్ కంటే దానిని ముందస్తుగా గుర్తించి ప్రివెంట్ చేయడమే ముఖ్యమన్నారు. గుండె ప్రాము ఖ్యతను అవగాహన కలిగించేందుకే సెప్టెంబర్ 27న వరల్డ్ హార్ట్ డే జరుపుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ బాబు, కిమ్స్ హాస్పిటల్స్ యూనిట్ హెడ్ డాక్టర్ హరి కుమార్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక నరసరావుపేట రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం కార్యాలయం ఆవరణలో క్రమం తప్పకుండా ఆర్థిక సహకారం అందిస్తున్న బిపి శ్యామ్ సుందర్రావు వారి ధర్మపత్నీ పుష్ప సహకారంతో శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సంఘం గత 14 సంవత్సరాల నుండి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని, ఇందులో భాగంగా శనివారం 90వ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సభ్యుల సహాయ సహకారాలతో మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, జి నాగేంద్రుడు, వైవి సుబ్బయ్య శర్మ, కృష్ణమూర్తి, అవ్వారు కోటేశ్వరరావు, ఎం.వి.శర్మ, ఆది రాములు, రాఘవయ్య, శంకరరావు, సిహెచ్ దీక్షితులు, రామలింగేశ్వర రావు, వెంకటస్వామి, గోపి, రఘు, దుబ్బల దాసు, ఏ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్విరామ శ్రమే విజయ రహస్యం

విశాలాంధ్ర-వినుకొండ: జీవితంలో అనుకున్నా లక్ష్యాన్ని సాధించేందుకు నిర్విరామంగా శ్రమిస్తే విజయం సొంతం అవుతుందని స్థానిక కృష్ణవేణి డిగ్రీ కాలేజ్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పి.సీతారాం బాబు అన్నారు. డీఎస్సీ 2025లో తమ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకొని టీచర్ ఉద్యోగాలు సాధించిన నలుగురు అభ్యర్థులను కళాశాల ప్రాంగణంలో అభినందించి విజేతలకు ఆయన ఘనంగా సత్కరించారు. డీఎస్సీ 2025లో విజయం సాధించిన పూర్వ విద్యార్థులు రావిపాటి అంజలీదేవి (ఎస్ ఏ సోషల్), కంచర్ల శ్రీనివాసరావు (ఎస్‌ఏపిఈ), షేక్ కరీమున్నిసా బేగం (ఎస్ ఏ సోషల్), ఎం.జ్యోతి (ఎస్‌జిటి) ఈ సందర్భంగా విజయం సాధించిన అభ్యర్థులను ప్రిన్సిపల్ ఆర్ యోగి, అధ్యాపకులు అభినందించారు.

కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరణ

విశాలాంధ్ర-వినుకొండ: బోసు బొమ్మ సెంటర్ వద్ద గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి శరన్నవరాత్రుల సందర్భంగా శనివారం ఆలయంలోని మూలవిరాట్ అమ్మ వారికి 10 లక్షల రూపాయల కరెన్సీ నోట్లతో అలంకరించారు. కళ్యాణ మండపం నందు ప్రత్యేక అలంకారం శ్రీ రాజరాజేశ్వరి కొలువు తీర్చారు. బాలికలతో భరతనాట్యం, కళ్యాణ మండపం ఆవరణలో మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం కమిటీ వారు మాట్లాడుతూ వచ్చే నెల 2వరకు నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించారన్నారు. ఈ ఉత్సవాలకు పట్టణ ప్రముఖులు, రాజకీయ నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు జొన్నలగడ్డ బాబ్జి, గౌరవ అధ్యక్షులు తాతా వెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ అమర్నాథ్, రెడ్డి నగేష్ బాబు, కోశాధికారి పెండ్యాల సురేష్, కొల్లిపర వెంకట నాగేశ్వరరావు, సదావర్తి సంఘం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని పూజ అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆట్యా-పాట్యాలో జడ్పీ విద్యార్థులకు ద్వితీయ స్థానం

విశాలాంధ్ర-వినుకొండ: ఈనెల 25 నుండి 27 వరకు పల్నాడు జిల్లా నకరికల్లు జడ్పీ హైస్కూల్లో జరిగిన 12వ అంతర్ జిల్లాల ఆట్యా- పాట్యా మెన్ అండ్ ఉమెన్ విభాగంలో వినుకొండ జడ్పీ గర్ల్స్ హై స్కూల్‌కు చెందిన డి.రాజినాభి, శ్రీలక్ష్మి, పుష్ప ప్రియ గుంటూరు జిల్లా తరపున ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం (బ్రౌంజ్ మెడల్) సాధించినట్లు గర్ల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బి.శైలజ కుమారి తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు రూత్ మేరీ, డి.మనీ, రేణుకలను అభినందించారు.

ఎస్సీ ఎస్టీల కోసం ప్రత్యేక పీజీఆర్ఎస్

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లాలోని ఎస్సీ ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెల నాల్గవ శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సంబంధిత వర్గాలు చేసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా జిల్లాలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ అర్జీలను అందించి సమస్యలను తెలియజేశారు.

సాగర్ బాబు కుటుంబాన్ని ఆదుకోవాలి

విశాలాంధ్ర-వినుకొండ: కారంపూడి మండలం, పెద్ద కొదమగుండ్ల గ్రామ పరిధిలోని కాకాని వారి పాలెం గ్రామానికి చెందిన దళిత యువకుడు వర్ల సాగర్ బాబు, కారంపూడి మండల విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం వలన విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాపాయ స్థితి నుండి బయటపడి కాళ్లు రెండు చచ్చుబడి పూర్తి వికలాంగుడిగా మారాడని, ఈ విషయం మీద విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకొని సాగర్ బాబు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలు పార్టీల నాయకులు అన్నారు. గత నాలుగు నెలలుగా కలెక్టర్, విద్యుత్ శాఖ అధికారులకు అర్జీలు ఇచ్చిన నేటికి ఎలాంటి చర్య లేకపోవడంతో గత 14 రోజుల నుండి సాగర్ బాబు తన కుటుంబం చేజర్లలో నిరవధిక దీక్షలకు కూర్చున్నారని, ఆయన చేసే దీక్షలకు న్యాయమైన పోరాటానికి సంఘీభావంగా ప్రజాసంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా శనివారం వినుకొండ తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ సురేష్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. పిడిఎం సీనియర్ నాయకులు వై వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్ష - కార్యదర్శులు షేక్ మస్తాన్వలి, జి.రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రెడ్డి పోయిన ప్రసన్న కుమార్, సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, సీపీఎం నాయకులు బొంకూరు వెంకటేశ్వర్లు, మాల మహానాడు నాయకులు విజయ్, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు ఫిరోజ్ ఖాన్, రైతు నాయకుడు ఘనపర్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద వామపక్షాలు, ప్రజాసంఘాల ధర్నా

సులభంగా నిర్మాణ అనుమతులు: యాగంటి

విశాలాంధ్ర-మాచర్ల: నాలా చట్టం రద్దుతో స్థిరాస్థిరంగానికి ఊరట లభిస్తుందని, తద్వారా పారిశ్రామిక రంగం అభివృద్ధి చెంది యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు అన్నారు. ఈ సందర్భంగా శనివారం యాగంటి విలేకరులతో మాట్లాడుతూ నాలా చట్టం రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. గతంలో స్థిరాస్తుల క్రయ విక్రయాల సమయంలో కానీ, భూమి మార్పిడి కోసం కార్యాలయాలు చుట్టూ ఏళ్ల తరబడి తిరగాల్సి వచ్చేదన్నారు. పారిశ్రామికవేత్తలకు ఊరట కలిగించేలా కూటమి ప్రభుత్వం గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో నాలా చట్టాన్ని రద్దు చేయడం ఒక చారిత్రాత్మకమని చెప్పవచ్చన్నారు. ఈ చట్టం రద్దుతో నిర్మాణాలకు అనుమతులు సులువు తరమవుతాయన్నారు. చారిత్రాత్మక నిర్ణయాలు సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ఆయన మరోసారి నిరూపించారన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థలాల అన్యాక్రాంతంపై కలెక్టర్‌కు ఎమ్మార్పీఎస్ ఫిర్యాదు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: పట్టణంలోని నెహ్రూ నగర్ ప్రాంతంలో జిల్లా పరిషత్ సోషల్ వెల్ఫేర్ విభాగం ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన స్థలాలు అన్యాక్రాంతమైన నేపథ్యంలో, ఈ రోజు జరిగిన ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ సమావేశంలో ఈ సమస్య చర్చకు వచ్చింది. ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) రాష్ట్ర అధ్యక్షులు అడపా మోహన్ మాదిగ ఈ సమస్యను సమావేశంలో ప్రస్తావించారు. అనంతరం అడపా మోహన్ మాదిగ కలెక్టర్ కృతికా శుక్లాను వ్యక్తిగతంగా కలిసి అర్జీని సమర్పించారు. అర్జీని పరిశీలించిన ఆమె తక్షణమే ఈ సమస్యపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. కలెక్టర్ వెంటనే చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్‌కి ఎండార్స్ ఇచ్చి, సమస్య పరిష్కారంపై ఫోన్ ద్వారా కూడా చర్చ జరిపారు. అనంతరం, కలెక్టర్ ఇచ్చిన ఎండార్స్ కాపీలను చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్‌కి అందజేసినట్లు అడపా మోహన్ మాదిగ తెలిపారు. స్థానికంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజల భూసంబంధిత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

పట్టణ మాల మహానాడు కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక వెల్లటూరు రోడ్‌లోని మాల మహానాడు కార్యాలయంలో వినుకొండ పట్టణ మాల మహానాడు అధ్యక్షులు రాయని చిన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో వినుకొండ పట్టణ ప్రచార కార్యదర్శిగా మేకల చెన్నయ్యను పట్టణ మహిళా అధ్యక్షురాలిగా దారా రంగమ్మకు శనివారం వినుకొండ నియోజకవర్గం అధ్యక్షులు కీర్తిపాటి వెంకటేశ్వర్లు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పట్టణంలోని మాలలంతా ఏకతాటిపైకి వచ్చి వర్గీకరణకు వ్యతిరేకంగా పనిచేయాలని, మాలల సమస్యలపై ప్రతి ఒక్కరు ఏకమవ్వాలని ఉద్యోగ, విద్యార్థి సంఘాలను ఏర్పాటు చేయాలని అన్నారు. సంవత్సరాల తరబడి కుంటుపడి ఉన్న స్మశాన సమస్యను పరిష్కరించే దిశగా మాలలు పోరాటం చేయాలని, మాలలను ఏకం చేస్తూ భవిష్యత్తు రాష్ట్ర కమిటీ తీసుకునే కార్యాచరణకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కొండ్రు విజయ్, వినుకొండ పట్టణ ఉపాధ్యక్షులు కొట్టె మనోజ్ కుమార్, కోశాధికారి పెనుమాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు గురై రైతు మృతి

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: బెండ తోటలో పొలం పనులు చేస్తున్న రైతు పాము కాటుకు గురై మృతి చెందిన సంఘటన జరిగింది. మండలంలోని చెన్నాయపాలెం గ్రామంలో శనివారం చోటుచేసుకున్న ప్రమాద ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు జంగిటి శ్రీనివాసరావు రోజువారి పలులో భాగంగా తన బెండ తోటకు వ్యవసాయ పనులు నిమిత్తం వెళ్ళాడు తోటలో పనిలో నిమగ్నమైన శ్రీనివాసరావును పాముకాటు వేసింది. ప్రమాద ఘటనలో బెండ తోటలోని అపస్మారధిలోకి వెళ్ళిన శ్రీనివాసరావు మృతి చెందారు. పరిసర ప్రాంత పొలం పనులకు వెళ్ళిన రైతులు శ్రీనివాసరావు మృతి చెందిన విషయాన్ని బంధువులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు మృతదేహాన్ని విగ్రహానికి తరలించి ప్రమాద సంఘటనపై పిడుగురాళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు పోలీసులు తెలిపారు.

జంట హత్యల కేసులో విచారణకు పిన్నెల్లి సోదరులు



విశాలాంధ్ర-మాచర్ల: ఈ ఏడాది మే 24న వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామ సమీపంలో తెదేపా నాయకులు జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావులను కారుతో ఢీ కొట్టి, బండరాయితో మోది హత్య చేసిన జంట హత్యల కేసులో 6వ నిందితుడు మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, 7వ నిందితుడైన ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఈ కేసులో విచారణకై శనివారం మాచర్ల రూరల్ సర్కిల్ పోలీసుస్టేషన్‌కు హాజరయ్యారు. ఉదయం 10:30 గంటలకు డీఎస్పీ జగదీష్ పర్యవేక్షణలో రూరల్ సీఐ షేక్ నఫీజ్ భాష ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఒక్కొక్కరిని విడివిడిగా అధికారులు విచారిస్తున్నట్లు తెలిసింది. ముందుగా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని మధ్యాహ్నం 3 గంటల వరకు విచారించి 170 ప్రశ్నలకు సమాధానం తీసుకున్నట్లు, తర్వాత పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిని తిరుపతిలో 140 ప్రశ్నలతో సమాచారాన్ని సేకరించినట్లు సమాచారం. విచారణలో పిన్నెల్లి సోదరులను వైసీపీ స్టేట్ లీగల్ సెల్ అధ్యక్షులు మనోహర్ రెడ్డి, హైకోర్టు న్యాయవాది రామలక్ష్మారెడ్డి న్యాయవాదులు సమక్షంలో విచారణ జరిగింది. అయితే ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం వీరు మొదట హైకోర్టు తర్వాత సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సుప్రీం కోర్టులో అరెస్టు నుంచి ఊరట లభించింది. కేసు విచారణకు సహకరించాలని కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు విచారణకు పిలవటంతో విచారణకు హాజరయ్యారు. ఏడాదిన్నర తర్వాత ఎమ్మెల్యే సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి మాచర్ల కి రావడంతో విషయం తెలుసుకున్న నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు నాయకులు పట్టణానికి భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా మాచర్ల పట్టణ సిఐ ప్రభాకర్, కారంపూడి సిఐ శ్రీనివాసరావులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఎక్కువ మంది ఆ పరిసర ప్రాంతాలకు రాకుండా చర్యలు తీసుకున్నారు.

జాతీయస్థాయి నాటక పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-తెనాలి : కొత్తపేట తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శనివారం కళలకాణాచి, తెనాలి ఆర్.ఎస్.ఆర్. గ్రీన్ వే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కళలకాణాచి జాతీయస్థాయి పంచమ పద్య, సాంఘిక, నాటక, నాటిక పోటీలు ప్రారంభ మయ్యాయి. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుఱ్ఱా జయలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉదయం ఎ.వెంకటలక్ష్మి బృందం కూచిపూడి ప్రదర్శనలు జరిగాయి. టి.జి.వి. కల్చరల్ అకాడమీ కర్నూలు వారు పద్యనాటకం "శ్రీ వేంకటేశ్వర మహత్యం", కల్లూరు సుబ్బారావు-లలిత కళాపరిషత్ అనంతపురం వారిచే పద్యనాటకం కాలభైరవ సంహారం ప్రదర్శించారు. సాయంత్రం వీణ అవార్డు నాటకోత్సవాల ప్రారంభ సభ వీణ విపంచి పుస్తకావిష్కరణను శాసన మండలి సభ్యులు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, డబుల్ హార్స్ అధినేత మునగాల శ్యాంప్రసాద్, ప్రముఖ నాటక రచయిత చిన్నమనేని మృత్యుంజయరావు, కళలకాణాచి అధ్యక్షుడు, సినీ రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుఱ్ఱా, గరికపాటి సుబ్బారావు, చెరుకుమల్లి సింగారావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కళలను పోషించడం తెనాలి ప్రసస్తిని దేశవ్యాప్తంగా ఇనుమడింప చేయడం చాలా గొప్ప విషయం అని దానిని నిర్వహిస్తున్న సాయిమాధవ్ బృందాన్ని అభినందించారు. కళలను కళాకారులు ఉన్నత స్థితికి తీసుకు వెళ్లేందుకు నిరంతరం కృషి చేయాలని చెప్పారు. ఈ సభకు ఏపీ నాటక అకాడమి ఛైర్మన్ కళారత్న గుమ్మడి గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. చిన్నమనేని మృత్యుంజయరావు సత్యాజు బాలచంద్ర రావు జీవిత విశేషాలను నాటక రంగానికి చేస్తున్న కృషిని వివరించారు. బాలచంద్రరావు సంస్కృతి అధ్యక్షునిగా ప్రముఖ రంగస్థల నిర్వాహకులుగా చేస్తున్నకార్యక్రమాలను వివరించి, ఆయన ఈనాడు ఈ పురస్కారానికి రానందుకు విచారాన్ని వ్యక్తం చేశారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు గరికపాటి సుబ్బారావు మాట్లాడుతూ కళారంగానికి నేటి ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరాన్ని తెలియజేశారు. సభానంతరం వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వెలగలూరు వారి నల్లత్రాచు నీడలో సాంఘిక నాటకం శ్రీనివాసరావు పోలుదాసు రచన దర్శకత్వంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా అతిథులను సంస్థ నిర్వాహకులు డాక్టర్ సాయిమాధవ్ బుఱ్ఱా, గోపరాజు విజయ్, చెరుకుమల్లి సింగారావు, దేవరపల్లి భవాని, అయినాల మల్లేశ్వరరావు, కొండముది రమేష్, కనపర్తి మధుకర్, షేక్ హకీంజాని మెమెంటోలతో శాలువాలతో సన్మానించారు.

శివాలయాన్ని దర్శించిన మంత్రి

విశాలాంధ్ర-పెదకాకాని: శివాలయాన్ని శనివారం మంత్రి వాసంశెట్టి సుభాష్ దర్శించు కున్నారు. ఆలయ అధికారులు, అర్చకస్వాములు, వేదపండితుల వేద మంత్రోచ్ఛారణల నడుమ మేళతాళములతో సాదర స్వాగతము పలికినారు. ఆలయ ప్రదక్షిణ అనంతరము శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్లకు ప్రత్యేక అభిషేకము, కుంకుమ పూజలు, రాహుకేతు పూజలలో మంత్రి పాల్గొన్నారు. ఆలయ అర్చకస్వాములు, వేదపండితుల వేద ఆశీర్వచనము అనంతరము శ్రీస్వామి వారి శేష వస్త్రముతో సత్కరించి శ్రీ స్వామి వారి ప్రసాదములను చిత్ర పటమును అందజేసినారు. అలాగే దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమీషనరు యస్.యస్.చంద్రశేఖర అజాద్ దంపతులు శ్రీ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం: డాక్టర్ కొండా

విశాలాంధ్ర- గుంటూరు వైద్యం : ప్రజల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయమని శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ చైర్మన్, ఆయుర్వేద అండ్ కేరళ పంచకర్మ వైద్య నిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు వెల్లడించారు. శ్రీదేవి నవరాత్రుల సందర్భంగా శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా నాడీ చూసి కీళ్ల నొప్పులు, డిస్క్ సమస్యలు, సయాటికా, పక్షవాతం, మోకాళ్ళ అరుగుదల, ఆస్తమా, ఎలర్జీలు, అధిక బరువు, చర్మ వ్యాధులు, సోరియాసిస్, ఫైల్స్, వెన్నుపూస సంబంధిత వ్యాధులను ఉచితంగా చూశారు. సుమారు 500 మంది పేషంట్లకు రూ. లక్షా పదివేల విలువ గల మందులు ఉచితంగా అందజేశారు. అనంతరం డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రీదేవి నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందన్నారు. ఈ శిబిరంలో హాస్పటల్ వైద్య బృందం డాక్టర్ మౌనిక, మేనేజర్ మల్లేశ్వరి, హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు

గంగానమ్మ దేవతకు సారె సమర్పణ

విశాలాంధ్ర-దుగ్గిరాల: మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో కొలువైయున్న శ్రీ గంగానమ్మ దేవతకు శనివారం అంగరంగ వైభవంగా సారె సమర్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రంగిశెట్టి ఫౌండేషన్ అధ్వర్యంలో మూడురోజుల పాటు జరగనున్న 13వ వార్షికోత్సవ ఉత్సవాల్లో తొలి రోజున శాశ్వత కైంకర్యా పరులు రంగిశెట్టి జగదీష్ బాబు,కుటుంబ సభ్యులు అమ్మవారికి 125 రకాల పుష్పాలు,పండ్లు, గాజులు,చీరలు,పసుపు,కుంకం, స్వీట్స్ తో అలంకరించి,మూడు వాహనాల్లో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.మేళతాళాలు, అమ్మవారి జానపదాలు నృత్యాలు, డప్పులు నడుమ వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన వాహనాల్లో గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించి,అనంతరం ఆలయ వద్దకు చేరుకున్నారు. నూతనంగా శిలలతో నిర్మాణం చేపట్టిన ఆలయం చుట్టు వివిధ రకాల పుష్పాలతో సుందరవణంగా తీర్చిదిద్దారు.ఊరేగింపులో డ్రోన్ల ద్వారా పుష్పాలను జల్లించారు.తదుపరి గంగానమ్మ తల్లికి పసుపు,కుంకాల నీళ్లతో సూక్త మహా అభిషేకాలు జరిపారు.అదేవిధంగా నూతనంగా ప్రతిష్ట జరిపిన అమ్మవారిని అలంకరణ చేసి సారెను సమర్పించారు.ఆలయ ప్రాంగణంలో భక్తి గీతాలు తో భజన కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలోని మహిళల భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.దీంతో గ్రామంలో పండుగ వాతావరణం వెల్లి విరిసింది.

సంగం నెయ్యి టీటీడీకి సరఫరా చేయడం గర్వకారణం: కాళహస్తి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సంగం డైయిరి చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ పి.గోపాలకృష్ణ నాయకత్వంలో సంగం డైయిరి అత్యున్నత ప్రమాణాలతో తయారు చేస్తున్న నెయ్యిని కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి తిరుమల తిరుపతి దేవస్థానంకు సరఫరా చేయడం గర్వ కారణమని శ్రీ సత్య ఇన్వెస్టిగేషన్ సెక్యూరిటీ సర్వీసెస్ సీఈఓ, విశ్రాంత అడిషనల్ ఎస్పీ కాళహస్తి సత్యనారాయణ కొనియాడారు. శనివారం వడ్లమూడి లోని సంగం డైయిరి కార్యాలయంలో చైర్మన్ నరేంద్ర కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మెమెంటో, ఎస్ఐఎస్ఎస్ బ్రోచర్ను చైర్మన్ కు ఆయన అందజేశారు. సత్యన్నారాయణ మాట్లాడుతూ టిటిడి వంటి ప్రఖ్యాత ఆలయానికి సంగం డైయిరి నెయ్యి సరఫరా చేయడం సంస్థకు మైలురాయి వంటిదన్నారు. నెయ్యి సరఫరా చేయడం నిష్ఠ, ఇది అత్యున్నత ప్రమాణాలు పాటించడం వల్ల సాధ్యమైందని పేర్కొన్నారు.

కేఎల్‌యూలో కుమార్తెల దినోత్సవం

విశాలాంధ్ర-తాడేపల్లి: కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో కుమార్తెల దినోత్సవాన్ని నిర్వహించారు. ఉమెన్ డెవలప్ మెంట్ సెల్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వర్సిటీలోని పలువురి అధ్యాపకుల కుమార్తెలు సందడి చేశారు. ఈ సందర్భంగా కెఎల్ మహిళా అభివృద్ధి సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య మాట్లాడుతూ ఆడపిల్ల లేనిదే సృష్టిలేదని అన్నారు. తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవడంలో కూతుర్లదే పైచెయి అన్నారు. ఆడ, మగా తేడా లేకుండా టెక్నాలజీలో దూసుకుపోతున్న ఈ రోజుల్లో ఆడపిల్లలు లేని లోటు ఎవరూ తీర్చ లేనిది అని అన్నారు. ఎంతో మంది కుమార్తెలు తల్లిదండ్రులు గర్వ పడేలా విజయాలు సాధిస్తున్నారని గుర్తు చేశారు. ఎంతోమంది అమ్మాయిలు తమ కుటుంబాలను పోషించడమే కాకుండా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు అమ్మలాగా సేవలు చేస్తున్నారని తెలిపారు. కూతురు అంటేనే లక్ష్మీదేవితో సమానమన్నారు. పెళ్లి తరువాత మరో ఇంటికి దేవతగా వెళుతుందని అయినా కన్న వారి మీద ప్రేమ ఏమాత్రం తగ్గదని అన్నారు. తల్లి దండ్రుల ఆలన పాలనా చూడడంలో కొడుకులతో పోలిస్తే కూతుర్లదే పైచెయి అని అన్నారు. అందుకే సమాజంలో ఆడపిల్ల పాత్ర చాలా గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థసారధి వర్మ, ప్రొ వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విధ్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కెఆర్ ఎస్.ప్రసాద్, అసోసియేట్ డీన్, ఉమెన్ డెవలెప్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కే రూత్ రమ్య తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

హైదరాబాద్, హైటెక్ సిటి, మీనాక్షి ట్రైడెంట్ అపార్ట్‌మెంట్ కాపురస్తులు లేటు ఆలూరి రామారావు గారి కుమారుడు **ఆలూరి చంద్రశేఖర్** (సెల్:98857 93808) తెలియజేయునది- నా తండ్రిగారైన ఆలూరి రామారావు, నా పెదనాన్నగారైన ఆలూరి పుల్లయ్య గార్ల పేరిటకు జాయింటుగా రిజిష్టరు కాబడిన ద.నెం.5138/1992, ద.నెం.5139/1992, ద.నెం.5140/1992 మరియు ద.నెం.5141/1992 (గుంటూరు ఎస్ఆర్ఓ.) ఒరిజినల్స్‌ను తీసుకుని ది.20-08-2025న గుంటూరు సిటి, బృందావన గార్డెన్స్‌లోని నా బంధువుల ఇంటికి వచ్చినాను. అంతట సదరు దస్తావేజులు జిరాక్సు అవసరమై బృందావనగార్డెన్స్ నుండి పట్టాభిపురం సెంటర్‌కు వెళ్లుచుండగా మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినవి. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

దస్తావేజు పోయినది

గుంటూరు సిటి, బృందావన గార్డెన్స్, 3వ లైను, డోరు నెం.3-30-56/3రు కాపురస్తులు యలమంచిలి శివాజి గారి భార్య **హేమ కర్నాటి** (సెల్:98857 93808) తెలియజేయునది- నా పేరిటకు శ్రీ గుంటూరు జిల్లా రిజిస్ట్రారు వారి కార్యాలయంలో రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు నెం. **6495/1993** ఒరిజినల్‌ను ది.20-08-2025న బృందావన గార్డెన్స్‌లోని నా ఇంటి నుండి పట్టాభిపురం సెంటర్‌కు వెళ్లుచుండగా మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

దస్తావేజు పోయినది

హైదరాబాద్, హైటెక్ సిటి, మీనాక్షి ట్రైడెంట్ అపార్ట్‌మెంట్ కాపురస్తులు లేటు ఆలూరి రామారావు గారి కుమారుడు **ఆలూరి చంద్రశేఖర్** (సెల్:98857 93808) తెలియజేయునది- నా తల్లిగారైన కర్నాటి వసంతలక్ష్మి గారి పేరిటకు శ్రీ గుంటూరు ఎస్ఆర్ఓ నందు రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు నెం. **2536/1987** ఒరిజినల్‌ను తీసుకుని ది.20-08-2025న గుంటూరు సిటి, బృందావన గార్డెన్స్‌లోని నా బంధువుల ఇంటికి వచ్చినాను. అంతట సదరు దస్తావేజు జిరాక్సు అవసరమై బృందావనగార్డెన్స్ నుండి పట్టాభిపురం సెంటర్‌కు వెళ్లుచుండగా మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

నోటీసు

మహారాజశ్రీ తెనాలి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. నెం. 731/2024

బిట్వీన్ :
అల్లమూడి నాగేశ్వర రావు ....వాది
ఎదిరి
అన్నం లక్ష్మీ వగైరాలు ....ప్రతివాదులు

టు:
అన్నం లక్ష్మీ, W/o.లేటు వెంకటేశ్వర రావు, డోర్ నెం.4-28-48, దంగెవారి వీధి, నందులపేట, తెనాలి.

పై నెంబరు దావాలో మీకు శ్రీ కోర్టు మరియు పోస్టు ద్వారాను సమన్లు చేయించినను మీరు తీసుకోనందున ఈ ప్రకటన ద్వారా నోటీసు నిమిత్తము శ్రీ కోర్టువారు ఆర్డరువేస్తూ మీ హాజరు కొరకు **ది.10-10-2025** తేదికి వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదా రోజు **ఉ॥గం॥10-30 ని॥**లకు మీరు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షమున విచారించి తీర్మానించబడును. **(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)**

వాయిదా తేది. 10-10-2025

ఎ. నాంచారయ్య, కె. మేరి గ్రేస్
వాది తరుపు అడ్వకేట్స్, రేపల్లె, సెల్: 9502333900

నోటీసు

మహారాజశ్రీ తెనాలి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. నెం. 660/2024

బిట్వీన్ :
దేశబోయిన మురళి కృష్ణ ....వాది
ఎదిరి
తుళ్ళిమిల్లి గోపి ....ప్రతివాది

టు:
తుళ్ళిమిల్లి గోపి,S/o.చింతయ్య, యాదవ పాలెం, అత్తోట గ్రామం,కొల్లిపర(మం),గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాలో మీకు శ్రీ కోర్టు మరియు పోస్టు ద్వారాను సమన్లు చేయించినను మీరు తీసుకోనందున ఈ ప్రకటన ద్వారా నోటీసు నిమిత్తము శ్రీ కోర్టువారు ఆర్డరువేస్తూ మీ హాజరు కొరకు **ది.10-10-2025** తేదికి వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదా రోజు **ఉ॥గం॥10-30 ని॥**లకు మీరు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షమున విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా తేది. 10-10-2025

వెలివెల రమేష్ బాబు
వాది తరుపు అడ్వకేట్. తెనాలి, సెల్: 9440241816

బహిరంగ ప్రకటన

నా క్లయింటు గుంటూరు సిటి, పాత గుంటూరు, వినోభానగర్ 6వ లైను, చర్చి దగ్గర, డోరు నెం.15-9-40రు కాపురస్తులు కట్టెబోయిన ముత్తమరాజు గారి కుమారుడు **కట్టెబోయిన నుమన్** (సెల్:97388 77589) గారి నంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా- నా క్లయింటు పేరిట గుంటూరు సిటి, పాత గుంటూరు, వినోభానగర్ 6వ లైను ఏరియాకు చెందిన మున్సిపల్ పాత వార్డు నెం.6రు, బ్లాకు నెం.7రు, టి.యస్.నెం.513రు మింజుమలె దరిమిలా గుంటూరు యు.యల్.సి. ఆఫీసు వారిచే రీ- సర్వే కాబడి మంజూరు కాబడిన డి.డిన్.నెం.1234/81-సిరు, తేది:02-04-1981 దాఖలా మున్సిపల్ వార్డు నెం.6రు, బ్లాకు నెం.7రు, టి.యస్.నెం.513/2, చ.గ.100ల స్థలము, డోరు నెం.15-9-59, అసెస్మెంట్ నెం.69779రుగా గల ఆర్‌సిసి డాబా యిల్లు కలదు. సదరాస్తి నా క్లయింటు పేరిటకు ది.31-03-2018న జాజుల సుశీల గారి ద్వారా శ్రీ గుంటూరు జిల్లా రిజిస్ట్రారు ఆఫీసులో విక్రయ దస్తావేజు నెం.2958/2018రుగా రిజిష్టరు కాబడినది. కాగా సదరు దస్తావేజునకు లింకు దస్తావేజు అయిన ద.నెం.8282/1983 (విక్రయ దస్తావేజు - గుంటూరు ఎస్ఆర్ఓ) ఒరిజినల్‌ను లోగడ గుంటూరు ఆర్‌టిఓ ఆఫీసు వద్ద ఫొటోస్టాట్ కోసం వెళ్లుచుండగా పోగొట్టుకున్నారు.
సదరు లింకు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల నా క్లయింటుకు అందజేసి తగిన పారితోషికము పొందగలరు. అలాగే సదరాస్తి విషయమై ఎవరికైనా అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్న యెడల నాకు గానీ, నా క్లయింటుకు గానీ 15 రోజులలోగా తెలియజేయగలరు. అట్లుకాక సదరు దస్తావేజును దుర్వినియోగపరిచిన యెడల నా క్లయింటు తీసుకొను చట్టపరమైన చర్యలకు బాధ్యులగుదురు.

ఇట్లు
పులివర్తి శ్రీనివాన్, ఎం.ఎ., ఎం.ఎల్., ఎం.ఎల్.ఎం., అడ్వకేట్, చిరునామా: అరండల్‌పేట 6/4వ లైను, గుంటూరు, సెల్: **9885652296**.

ఆర్వోబీ పనులు పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: శంకర్ విలాస్ ఆర్వోబీ పనులను జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా శనివారం పరిశీలించారు. జీజీహెచ్ వద్ద నుండి బ్రాడిపేట - అరండల్ పేట వరకు జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. ఆర్వోబీ పనుల వలన ట్రాఫిక్ లో ఇబ్బందులు ఎదురు అవుతుందని దృష్టికి రావడంతో పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి కావడానికి అవసరమగు చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్వోబీ పనులు రూ.98 కోట్లతో 930 మీటర్ల పొడవున నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. పనులు సకాలంలో పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ట్రాఫిక్ అంతరాయం త్వరితగతిన పరిష్కారం కావడానికి దోహదం అవుతుందని చెప్పారు. రహదారులు, భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ సి.విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ బ్రాడిపేట వద్ద కొంత స్థలం క్లియర్ కావలసి ఉందని, అది పూర్తి అయితే నిర్మాణానికి ఎటువంటి ఆటంకం లేదని వివరించారు. ఈ కార్యక్రమంలో రహదారులు, భవనాల శాఖ డి.ఇ డి.చిన్నయ్య, ఏ.ఇ వి.సాయి కృష్ణ, లక్ష్మీ ఇన్ ఫ్రా డెవలపర్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ

విశాలాంధ్ర-తెనాలి : హార్వెస్ట్ ఇండియా సంస్థ ద్వారా పేదలకు అండగా నిలబడుతున్న కత్తెర సురేష్ దంపతులు అభినందనీయులని గుంటూరు - కృష్ణ జిల్లాల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హార్వెస్ట్ ఇండియా సంస్థ తెనాలి ప్రాంతంలోనే కాకుండా అనేక ప్రాంతాలలో విస్తృత సేవలు అందించాలని, పేదలకు అండగా నిలబడుతున్న సంస్థ అధినేత అభినందనీయులన్నారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం ఆనందదాయకం అన్నారు. మహాత్మ గాంధీ మార్కెట్ నందు 400 మంది పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాస్ వ్యవస్థాపకులు సుద్దపల్లి నాగరాజు, కత్తెర డేవిడ్, యశ్వంత్, కుద్దుస్, నలుకుర్తి రమేష్, దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కొందూరు ముత్తయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు బోసుబాబు, దిలీప్, రమేష్, పూర్ణ, శ్రీధర్, రాహుల్, కోటి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ ప్రయోజనాలు ప్రజలకు చేరువ చేయాలి

విశాలాంధ్ర-దాచేపల్లి: జీఎస్టీ ప్రయోజనాలు ప్రజ లకు మరింత చేరువ చేయాలని డీఎల్ డీఓ గబ్రూనాయక్ కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో కొత్త జీఎస్టీ విధానంపై అవగాహన కల్పించారు. తహశీల్దార్ గోగసాని శ్రీనివాస యాదవ్, ఎంపీడీఓ ఉల్లంగుల వెంకటేశ్వరరావు, జీఎస్టీ నోడల్ అధికారులు మాట్లాడుతూ సామాన్యుడికి ఉపయోగపడే విధంగా ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జీఎస్టీ సంస్కరణలను ప్రజల వద్దకు చేర్చాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సచివాలయాల సిబ్బంది, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

పప్పుల దేవదాసుకు గుర్రం జాషువా పురస్కారం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఏపీ హైకోర్టు ఎస్సీఎస్టీబీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ హాల్ నందు కవి కోకిల, నవయుగ చక్రవర్తి గుర్రం జాషువా 130వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సమాజానికి తన సేవలను అందించిన న్యాయవాది పప్పుల దేవదాసుకి గుర్రం జాషువా పురస్కారంతో సన్మానించారు. ఈ సమావేశానికి కార్యక్రమ నిర్వాహకులు జంపలి పాల్ ప్రసాద్ అధ్యక్షత వహించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ ట్రెజరర్ దుర్గా ప్రసాద్, సీనియర్ న్యాయవాది చలపతిరావు, న్యాయవాదులు ఎన్.సామ్యుయేల్, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మణికంత కుటుంబానికి న్యాయం చేయాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-మంగళగిరి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో లైబ్రరీ నుంచి ప్రధాన ద్వారం వరకు విద్యార్థులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడు శివ అధ్యక్షతన జరిగిన ఈ ర్యాలీలో విద్యార్థులు నినాదాలు చేస్తూ మణికంత కుటుంబానికి న్యాయం చేయాలని, ఆంధ్ర విశ్వవిద్యాలయ వీసీ తక్షణమే రాజీనామా చేయాలని, విశ్వవిద్యాలయాల్లో మెడికల్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి యశ్వంత్ మాట్లాడుతూ "బీఈడీ రెండో సంవత్సరం విద్యార్థి మణికంత యూనివర్సిటీలో ఫిట్స్ వచ్చి గుండెపోటుతో మృతి చెందడం వీసీ నిర్లక్ష్యం వల్లే జరిగింది. వైద్య వసతులు లేకపోవడం, ఆక్సిజన్ అందుబాటులో లేకపోవడం వల్లే ఈ ఘటన జరిగింది" అని తీవ్రంగా విమర్శించారు. గతంలో అనేకసార్లు విద్యార్థి సంఘాలు వీసీకి విజ్ఞప్తి చేసినా కాలయాపన చేశారని ఆయన ఆరోపించారు... ఏఎన్‌యు ఇంచార్జ్ పాలెం నాసరయ్య మాట్లా డుతూ "రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో కనీసం అంబులెన్స్, ఆక్సిజన్ సిలిండర్ కూడా లేకపోవడం విచారకరం. మణికంత మరణం మనందరినీ కలచి వేసింది" అని తెలిపారు. నారా లోకేష్ రాజధానిలో ఇల్లు కట్టుకోవడంలో శ్రద్ధ చూపుతారు కానీ విద్యార్థులు చనిపోతే సానుభూతి తెలపడానికి కూడా రారని మండిపడ్డారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలలో ప్రత్యేక వైద్యశాలలు ఏర్పాటు చేసి, 24 గంటలపాటు వైద్యులు, నర్సులు అందుబాటులో ఉండేలా చూడాలని, నిరంతరం తనిఖీలు జరపాలని డిమాండ్ చేశారు. అలాగే మణికంత కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా యూనివర్సిటీ యాజమాన్యం ప్రకటించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి అమర్నాథ్, ఏఎన్‌యు నాయకులు అర్జున్, అఖిల్, వెంకీ నాయక్, హెబ్రీ, డేవిడ్, శ్రీకాంత్, బాబి, వెంకట కోటయ్య, సాగర్, చందు, ప్రతాప్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీతో ప్రజలకు మేలు: ఎంపీపీ

విశాలాంధ్ర-నూజెండ్ల: సూపర్ జీఎస్టీతో ప్రజలం దరికీ పెద్ద మేలు జరుగుతుందని ఎంపీపీ మేడం జయరామరెడ్డి అన్నారు.మండల పరిషత్ అభివృద్ధి అధికారి పావులూరు ఉమాదేవి మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణల వల్ల నిత్యావసర సరుకులు, గృహోపకరణాలు, ఔషధాలు,విద్య, స్టేషనరీ ఉత్పత్తులు, వస్త్రాలు,క్రీడ వస్తువులు, రవాణా, హోటల్ రంగాలలో పన్నులు తగ్గుతాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గ్రామాలలో దసరా నుండి దీపావళి వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలియజేశారు.తగ్గిన జీఎస్టీ రేట్లు వివరాలుతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు జడ్డా సుబ్బులు రామయ్య, ఆయాగ్రామాల సర్పంచులు, మండల విద్యాశాఖ అధికారి కాకర్ల సత్యనారాయణ, జీఎస్టీ ఎగ్జిక్యూటివ్ అధికారి వెంకటేశ్వరరావు,నూజెండ్ల సొసైటీ చైర్మన్ బచ్చు అంజిరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ అల్లాబక్షు,హౌసింగ్ ఏఈ యలమంద,ఏపీఓ ఆంజనేయరాజు, బిజెపి సీనియర్ నాయకులు ఎండ్లూరి వీరయ్య, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

భయమెరుగని విప్లవ వీరుడు భగత్ సింగ్

విశాలాంధ్ర-మంగళగిరి: భారత్‌లో బ్రిటీషు పాలనను వ్యతిరేకిస్తూ విప్ల వాత్మక ఉద్యమాలను చేపట్టినభారత స్వాతంత్ర్య సమర యోధుడు ప్రఖ్యా త ఉద్యమకారుడు భగత్ సింగ్ జయంతి సందర్భంగా శనివారం మంగళగిరి పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి గుడి దగ్గర ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో గల భగత్ సింగ్ విగ్రహానికి ఏఐఎస్ఎఫ్ ఏఎన్‌యూ శాఖ అధ్యక్షులు కృష్ణాంజనేయులు, ప్రధాన కార్యదర్శి అఖిల్, కోశాధికారి వెంకటేష్ నాయక్, పాలెం నాసరయ్య లు పూలమాలలు వేసి జయంతి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాలెం నాసరయ్య మాట్లాడుతూ ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదించి యావత్ భరత జాతిలో పోరాట స్ఫూర్తిని రగిలించిన భయమెరుగని విప్లవ యోధుడు షహీద్ భగత్ సింగ్‌ను అశేష భారత జాతి గుండెల్లో పెట్టుకొంది. విద్యార్థి ఉద్యమాల్లో ఆయన ఆత్మబలం, త్యాగస్ఫూర్తి ఎల్లప్పుడూ ప్రేరణగా నిలుస్తుందని పాలెం నాసరయ్య పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. భగత్ సింగ్ జీవితం నుంచి ప్రతి ఒక్కరం స్ఫూర్తి పొందాలి అని కొనియాడారు.

నేడు లయన్స్ మహిళా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర-పొన్నూరు: లయన్స్ క్లబ్ ఆఫ్ పొన్నూరు స్వర్ణపురి మహిళ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు బేతాళ ఝాన్సీ రాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ ల గవర్నర్ సిహెచ్ హరిప్రసాదరావు పాల్గొంటారని తెలిపారు. విశిష్ట అతిథులుగా పి గోపీచంద్, కే విజయ్ చందు, ఎన్ వెంకటేశ్వరరావు, ఎస్ వెంకటేశ్వర్లు పాల్గొంటారని చెప్పారు. స్వర్ణపురి మహిళా అధ్యక్షురాలుగా బేతాళ ఝాన్సీ రాణి, కార్యదర్శిగా జి. శోభ కలూషా, కోశాధికారిగా పి. నిర్మలాదేవి తో పాటు పలువురు వివిధ విభాగాలకు సంబంధించిన వారు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. పేదలకు చీరలు, దుప్పట్ల పంపిణీ, విద్యాభివృద్ధి పథకం ద్వారా ఉపకార వేతనాలు, ఆరోగ్య పథకం ద్వారా పలువురికి పరికరాల పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఝాన్సీ రాణి కోరారు.

'అడ్వాన్స్‌డ్ గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్' ప్రారంభించిన డిప్యూటీ మేయర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నాణ్యమైన జుట్టు, చర్మ సంరక్షణకు అత్యుత్తమమైన వైద్య సేవలు అందించాలని గుంటూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ షేక్ సజీల కోరారు. శనివారం లక్ష్మీపురం యూనియన్ బ్యాంక్ పక్కన క్లినిక్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ శరణ్ వెల్ జే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్ డ్ గ్రో హెయిర్ అండ్ గ్లో స్కిన్ క్లినిక్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం క్లినిక్ వ్యవస్థాపకులు, డైరెక్టర్‌తో.. డాక్టర్స్‌తో కలిసి షేక్ సజీల జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ క్లినిక్‌ను తాను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కష్టమర్లకు అత్యంత నాణ్యమైన చర్మ సంరక్షణ వైద్య సేవలు అందించి కష్టమర్ల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ శరణ్ భవిష్యత్తులో మరిన్ని బ్రాంచీలు ఏర్పాటు చేయాలని ఆమె అభిలాషించారు. ఆధునిక హెయిర్, స్కిన్ కేర్ సొల్యూషన్స్ గుంటూరుకు తీసుకురావడం శుభపరిణామమని కొనియాడారు. శరణ్ వెల్ జే మాట్లాడుతూ భారతదేశంలో అడ్వాన్స్‌డ్ గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్ 105వ బ్రాంచ్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 19 బ్రాంచులు ఉన్నాయన్నారు. ఏపీలో మూడవదన్నారు. ఈ క్లినిక్‌లో హెయిర్, స్కిన్ చికిత్సలకు ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా సమగ్ర ప్యాకేజీలు ఉన్నాయని, ఉచిత కన్సల్టేషన్ కలదన్నారు. ఫ్రాంచైజీ పార్ట్‌నర్ భార్గవి గంజి మాట్లాడుతూ అత్యుత్తమ సేవల ద్వారా కష్టమర్ల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలన్న లక్ష్యంతో వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. అడ్వాన్స్‌డ్ గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్ అందరికి అందుబాటులో ఉన్నత ప్రమాణాల వెల్‌నెస్ పరిష్కారాలు అందిస్తూ.. మరింత మెరుగైన భవిష్యత్తుకు బాటలు వేస్తామన్నారు. మరింత సమాచారానికి 9959154371, 9985310069 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లినిక్ డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-గుడివాడ : నందమూరి తారకరామారావు మెమోరియల్ రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ మెన్ బాస్కెట్‌బాల్ పోటీలను శనివారం స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో క్రీడా ప్రణాళికలో భాగంగా రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలను యలవర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లా డుతూ ఈ నెల 27వ తేది నుండి 29వ తేది వరకు ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 15 జిల్లాల నుండి బాస్కెట్‌బాల్ టీమ్‌లు పాల్గొనడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్తా కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, టీడీపీ నాయకులు సిహెచ్ జగన్‌మోహనరావు, కమిటి సభ్యులు అట్లూరి భవాని ప్రసాద్, బొగ్గవరపు తిరపతయ్య, జి.వి వరప్రసాద్, దొప్పలపూడి రవికుమార్, జివి రాఘవేంద్రరావు, వల్లభనేని లక్ష్మీకృష్ణప్రసాద్, కోచ్‌లు క్రీడాకారుల పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థికి నియామక పత్రం అందజేత

విశాలాంధ్ర-కూచిపూడి : కృష్ణాజిల్లా లోని మొవ్వమండలం కూచిపూడి గ్రామానికి చెందిన ఆణిముత్యం డీఎస్సీలో కృష్ణాజిల్లా స్థాయిలోనే నాలుగో ర్యాంకు సాధించి పలువురి ప్రశంసలు పొందింది. కూచిపూడికి చెందిన వినుకొండ శివరామకృష్ణ (మైక్) మొదటి కుమార్తె వినుకొండ కనకదుర్గ స్కూల్ అసిస్టెంట్ (లెక్కలు) డీఎస్సీలో సాధించిన నాలుగో ర్యాంకుతో ఆ కుటుంబం (ఐదవ వార్డు మిల్లు బజారు) తమ ఆనందాన్ని పలువురితో పంచుకున్నారు. సామాన్య కుటుంబానికి చెందిన ఆమెప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకొని వివాహమై ఇద్దరు పిల్లలు కలిగిన తర్వాత ప్రగతి (పామర్రు) విద్యాసంస్థలో శిక్షణ పొంది రాష్ట్ర గృహనిర్మాణ,పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సమక్షంలో పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ద్వారా నియామక పత్రాన్ని అందజేశారు. శివరామకృష్ణకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నత విద్యా వంతులే. కనకదుర్గ నాలుగు నుంచి పదవ తరగతి వరకు శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ స్కూల్లో చదివి పదవ తరగతిలో 521 మార్కులు సాధించి, మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ (ఎంపీసీ) 911 మార్కులు పొంది మొదటి స్థానంలో నిలిచింది డిగ్రీ(బిఎస్సీ)లో కూడా 80% పైగా మార్కులతో ఉత్తీర్ణత పొంది మచిలీపట్నం ఆంధ్ర జాతీయ కళాశాలలో బీఈడ్ చేసింది. అనంతరం గంపలగూడెం లోని కస్తూరిబా బాలికల పాఠశాలలో కాంట్రాక్ట్ పోస్టులో టీచరుగా పనిచేసి సంతృప్తి చెందగా డీఎస్సీ కోచింగ్‌కి ప్రిపేర్ అయి 82 మార్కులకు పైగా పొంది తన లక్ష్యాన్ని సాధించింది. ఆమె భర్త చెన్నకేశవ స్వామి విద్యుత్ శాఖలో పని చేస్తుండటంతో నియోజకవర్గ కేంద్రమైనా పామర్రు నివాసం ఉంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

శ్రీ వాహిని ఇంజినీరింగ్ కాలేజీలో బతుకమ్మ వేడుకలు

విశాలాంధ్ర-తిరువూరు: శ్రీ వాహిని ఇంజినీరింగ్ కాలేజీ అవరణలో బతుకమ్మ వేడుకలను శనివారం విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో బతుకమ్మను అలం కరించి పాటలు పాడుతూ, నృత్యం చేస్తూ సాంప్రదాయాన్ని ప్రతిబింబిం చారు. విద్యార్థులు ఉత్సాహంగా కొలాటం ఆడి వేడుకను మరింత ఆనందంగా మార్చారు.కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు భారతీయ సంప్రదాయాలను, సాంప్రదాయ సంస్కృతిని తెలుసుకోవడం చాలా అవసరమని, ఇలాంటి వేడుకలు ఐక్యతను పెంపొంది స్తాయని పేర్కొన్నారు. అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులతో కలిసి పాల్గొని వారిని ప్రోత్సహిం చారు.విద్యార్థులు తమ కళాశాలలో బతుకమ్మ వేడుక నిర్వహించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.బతుకమ్మ పండుగ పర్యావరణ పరిరక్షణకు, సమా జంలో ఐక్యతకు చిహ్నమని తెలిపారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థుల సమిష్టి కృషితో ఈ బతుకమ్మ వేడుక విజయవంతంగా జరిగాయి.

వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : వరల్డ్ హార్ట్ డే సందర్భంగా సూర్యారావు పేటలోని డాక్టర్ ఎన్ సుబ్బారావు సెంటర్ ఫర్ కార్డియాక్ సెంటర్ లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ మురళి కృష్ణ తెలిపారు.శిబిరంలో పాల్గొన్న వారికి ఈ సి జీ,2డి ఎకో,ఆర్ బి ఎస్,హెచ్ బి ఏ1 సి,లిపిడ్ ప్రొఫైల్,ఉచిత కన్సల్టేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో వైద్య పరీక్షలు అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలియజేశారు. పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి జాతీయ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్

30 రాష్ట్రాలు నుండి సుమారు వెయ్యి మంది క్రీడా ప్రతినిధులు రాక

రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి వెంకట రామకృష్ణ ప్రసాద్ వెల్లడి

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : విజయవాడలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 28 నుంచి నాలుగు రోజుల పాటు 6వ జాతీయ జూనియర్ (14 నుంచి 18 సంవత్సరాల్లోపు), సీనియర్-సి (45 నుంచి 55 సంవత్సరాల్లోపు) యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ నిర్వహిస్తామని రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి వెంకట రామకృష్ణ ప్రసాద్ తెలిపారు. స్థానిక పీబీ సిద్ధార్థ కళాశాల ఇండోర్ స్టేడియంలో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, యోగాసన భారత్ ఆధ్వర్యంలో రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం సౌజన్యంతో జరుగుతున్న ఈ పోటీల్లో దేశంలోని పలు ప్రాంతాల నుంచి 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 618 మంది క్రీడాకారులు, వంద మంది కోచ్‌లు, మేనేజర్లు పాల్గొంటారన్నారు. వీరితో పాటు పోటీల నిర్వహణలో భాగంగా వంద మంది అఫిషియల్స్, మరో వంద మంది వాలంటీర్లు వారి వారి విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే బాలికలు, మహిళలకు గురునానక్ కాలనీలోని శ్రీచైతన్య కళాశాలలో, బాలురు, పురుషులకు ఈడుపుగల్లులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఉచిత వసతి సదుపాయం కల్పించామన్నారు. పోటీల నిర్వహణ వేదిక వద్ద ప్రతి ఒక్కరికీ ఉచిత భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. పోటీల సంచాలకుడు అభిజిత్ బోస్ మాట్లాడుతూ, జూనియర్స్ బాలబాలికల విభాగంలో ట్రెడిషనల్ వ్యక్తిగత, గ్రూప్, ట్రెడిషనల్ స్పెసిఫికేషన్, ఆర్టిస్టిక్, సోలో, ఆర్టిస్టిక్ పెయిర్, బృందం, రిథమిక్ పెయిర్ ఈవెంట్లతో పాటు సీనియర్-సి'లో ట్రెడిషినల్ వ్యక్తిగత, స్పెసిఫికేషన్ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల నుంచి అంతర్జాతీయ యోగాసన పోటీల్లో పాల్గొనే భారత జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఈ సందర్భంగా పోటీలకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం అధ్యక్షురాలు ఎ.రాధిక, యోగాసన భారత్ స్పోర్ట్స్ కన్సల్టెంట్ శ్రేయస్ మార్కండేయ, రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం ప్రధాన కార్యదర్శి పి.ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.రాజశేఖరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు కె.రామకృష్ణ, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు డి.దుర్గారావు, ఎన్టీఆర్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ సంఘం అధ్యక్షుడు కొంగర సాయి, తదితరులు పాల్గొన్నారు.

సోఫాల విభాగంలో అడుగిడిన సెంచురీ మ్యాట్రెసెస్

విశాలాంధ్ర-విజయవాడ: భారతదేశంలో నిద్రవిషయంలో ప్రత్యేకత సాధించిన సెంచురీ మ్యాట్రెసెస్ ఇప్పుడుకొత్తగా సెంచురీ సోఫాలతో బెడ్రూంల నుంచి లివింగ్ రూంలలోకికూడా ప్రవేశించింది. వీటిని కంపెనీ బ్రాండ్ అంబాసిడర్ పీవీసింధు హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఇన్నాళ్లూ పరుపులు, దిండ్లకే పరిమితమైన ఈ కంపెనీ ఇప్పుడు కంఫర్ట్ టెక్నాలజీలోకి అడుగు పెట్టింది. భారతదేశంలో ఫర్నిచర్ మార్కెట్ శరవేగంగా విస్తరిస్తోంది. దీంతో సెంచురీ సంస్థ ఆధునిక డిజైన్లు, కంఫర్ట్ సైన్స్ రెండింటినీమిళితం చేసి ఒక విభిన్నమైన సౌకర్యాన్ని అందించాలని లక్ష్యంగాపెట్టుకుంది. లోపల స్మార్ట్, బయట సాఫ్ట్ అనే సరికొత్త హామీతోసెంచురీ సోఫాలు రంగప్రవేశం చేస్తు న్నాయి. ఇందులో 3 సీటర్, 2 సీటర్, సింగిల్ సీటర్, ఇంకా పొడవైన యూనిట్లు కూడాఉన్నాయి. వేర్వేరు ధరల్లో ఇవి అందుబాటులో ఉన్నాయి. ఈ సందర్భంగా సెంచురీ సోఫాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉత్తమ్మలానీ మాట్లాడుతూ, "గత 30ఏళ్లుగా స్లీప్ కంఫర్ట్ కుమారుపేరుగా, విశ్వసనీయమైన బ్రాండుగా సెంచురీ ఉంది. మాప్రయాణంలో సోఫాలకు విస్తరించడం మా ప్రయాణంలో చాలాసహజమైన పురోగతి. సోఫాలు అనేవి కేవలం ఫర్నిచర్ కాదు. అవి కుటుంబజీవితానికి, సమగ్ర ఆరోగ్యానికి కేంద్రస్థానం. ఇన్నాళ్లుగా కొన్ని కోట్ల కుటుంబాలకు మా పరుపులతో ఇచ్చిన విశ్వాసం, సౌకర్యం ఇప్పుడూ ఇస్తామని చెప్పడానికి గర్వంగాఉంది" అన్నారు. పద్మభూషణ్ పురస్కార గ్రహీత,సెంచురీ బ్రాండ్ అంబాసిడర్పీవీ సింధు ఆవిష్కరించడంతో దీనికి మరింత ఆదరణలభిస్తోంది ఆమె ఎప్పుడూ కచ్చితత్వం సాధించడం కోసంనిర్విరామంగా శ్రమిస్తుంటారు. ఈ బ్రాండుఇన్ని సంవత్సరా లుగా నిలబడిన నిబద్ధత, పనితీరులాంటి విలువలనే ఆమె కూడాపాటిస్తుంటారు. "కష్టపడి పనిచేయడంతో పాటు విశ్రాంతి, కోలుకోవడం కూడాఅంతే ముఖ్యమని నేనెప్పుడూ విశ్వసిస్తాను. సోఫాల విభాగంలకివిస్తరించాలన్న సెంచురీ నిర్ణయం ఇంట్లోని ప్రతి మూలనూసౌకర్యవంతంగా రూపొందిం చాలన్న వారి నిబద్ధతకు నిదర్శనం అని అన్నారు.

లడఖ్ ప్రజాస్వామ్య ఉద్యమంకు సంఘీభావం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రామన్ మెగసెసే అవార్డు గ్రహీత, పర్యావరణ యోధుడు, విద్యా సంస్కరణ కారుడు సోనం వాంగ్‌చుక్‌ను దేశ ద్రోహం చట్టం కింద అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మని ఆమ్ ఆద్మీ పార్టీ జోనల్ కో-ఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు తెలిపారు. శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో లడఖ్ ప్రజాస్వామ్య ఉద్యమ సంఘీభావ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా న్యాయం కోరిన వాంగ్‌చుక్‌ను దేశద్రోహం కింద అరెస్టు చేయడం, ప్రజల గొంతు నొక్కే ప్రయత్నమే అవుతుందన్నారు. జైభీమ్‌రావ్ పార్టీ నాయకులు వై.కొండలరావు,పరసా సురేష్ మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబా అరెస్టు సమయంలో మనం మౌనంగా ఉన్నాం. అదే తప్పును మళ్లీ చేయకూడదన్నారు.ఈరోజు సోనం వాంగ్‌చుక్ అరెస్టును ప్రతిఘటించకపోతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది అన్నారు. అనంతరం "సోనం వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేయటంతో పాటు లడఖ్ ప్రజాస్వామ్య ఉద్యమానికి మద్దతు తెలుపుతూ అన్ని ప్రజాస్వామ్య శక్తులు ఒకే వేదికపైకి రావాలి" అనే ఏకగ్రీవ తీర్మానం చేశారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొసనం రాము,ఎపిపి నాయకులు పర్వతనేని హరికృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ ప్రారంభం

- జీఓ నెంబర్ 4లో క్రీడా వర్గీకరణ సమస్య పరిష్కారానికి కృషి
- ప్రభుత్వం ప్రాంతీయ క్రీడా హస్టళ్లను పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు
- శాప్ ఛైర్మన్ రవినాయుడు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : రాష్ట్ర ప్రభుత్వం చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న క్రీడా వర్గీకరణ సమస్యను పరిష్కరించడానికి కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ అనిమిని రవి నాయుడు హామీ ఇచ్చారు. ప్రస్తుతం, జీఓ నెం బర్ 4 ప్రకారం, క్రీడలు, ఆటలను రెండు వర్గాలుగా వర్గీకరించారు. కేటగిరీ-బీ లోనివి ఉపాధి అవకాశా లను కోల్పోతున్నాయని, ఈ విష యాన్ని ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి సమాన అవకాశాలను అందించడానికి అన్ని క్రీడలు, ఆట లను ఒకే వర్గంలోకి తీసుకువస్తానని రవి నాయుడు హామీ ఇచ్చారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సీనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌ను బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రామ్‌ప్రసాద్, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్‌తో కలసి శాప్ ఛైర్మన్ రవి నాయుడు శనివారం ప్రారంభించారు. దీనివల్ల ఐటీఏల ప్రభుత్వం నిర్వహిం చిన మెగా డీఎస్సీ ద్వారా 391 అత్యుత్తమ క్రీడాకారు లను ఎలాంటి రాత పరీక్ష లేకుండానే నేరుగా ఉపా ధ్యాయ పోస్టులకు ఎంపికైనట్లు తెలిపారు. క్రీడలలో అసాధారణ ప్రతిభ కనబరిచిన వారిని రాత పరీక్షలకు హాజరు కావాల్సిన అవసరం లేకుండా నేరుగా ఉద్యోగ నియామకాలకు పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ ఎస్.సంతోష్ కుమార్, టోర్నమెంట్ పరిశీలకుడు కె.జగదీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.శేఖర్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.దిలీప్ ప్రసన్న బాబు, తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు ఉత్సవ్ వేడుకలు

విశాలాంధ్ర-తిరువూరు: పట్టణంలో, విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) ఆదేశాల మేరకు పట్టణ పార్టీ, మండల పార్టీ అధ్యక్షతన సంస్కృతిక కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. కళాకారులు, విద్యార్థులు పట్టణంలో ఉన్న వినాయకుని గుడి దగ్గర నుండి కళాకారులు, స్థానిక విద్యార్థులు కోలాటం మొదలైన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఒకే పట్టణం- ఒకే ఉత్సవం రీతిలో విజయవాడ ఉత్సవ్-2025న నిర్వహించడం ద్వారా సాంస్కృతిక ఐక్యతను ప్రతిబింబించేలా కార్యస్యాన్ని నిర్వహించారు. సామూహికంగా కోలాటం, నాట్య ప్రదర్శనలు,సంగీత కార్యక్రమాలు ప్రాధాన్యత పొందాయి.పట్టణ వినాయకుని గుడి నుండి బోసుబొమ్మ సెంటర్ మీదుగా జైబావి సెంటర్ వరకు భారీ ర్యాలీగా సంగీతాలు ఆలపిస్తూ, కోలాట నూత్యాలతో కార్యక్రమం నిర్వహించారు.

సాంఘిక పెట్టుబడి అభివృద్ధికి పునాది

– ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ పివి రమేష్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: ప్రపంచ వ్యాప్తంగా సాంఘిక పెట్టుబడి ప్రభలంగా ఉన్న దేశాలే వేగ ంగా అభివృద్ధి చెందాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ పివి రమేష్ అన్నారు. అయితే భారతదేశంలోని ప్రజలను కులాలు, మతాల వారీగా విభజించడంతో త్వరిత గతిన అభివృద్ధి చెందలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో 'చేయూత ఫౌండేషన్' ప్రారంభోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పివి. రమేష్ మాట్లాడుతూ 1990లో భారతదేశం, చైనా తలసరి ఆదాయం చేరో 330 డాలర్లు ఉండగా.. నేడు చైనా 14,800 డాలర్లకు చేరగా, భారతదేశం 2,600 డాలర్లకే పరిమితమైందన్నారు. భారత సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించడానికి చేయూత ఫౌండేషన్ లాంటి సంస్థలు ప్రధాన పాత్ర పోషించాలని, నైపుణ్యం గల విద్యను ప్రతిభ గల పేదలకు అందిం చాలని కోరారు. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ ద్వారా వేగవంతమైన అభివృద్ధిని సాధించగలమని, విద్య ప్రమాణాల ద్వారానే అలాంటి ప్రగతిని సాధించగలమన్నారు. సభకు అధ్యక్షత వహించిన జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ అధ్యక్షులుగా డాక్టర్ పివి. రమేష్, ఐఏఎస్ రిటైర్డ్, కార్యదర్శిగా వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ఉపాధ్యక్షులుగా డొక్కా మాణిక్య వరప్రసాద్, కోశాధికారిగా కె.ఎస్. లక్ష్మణరావుతో పాటు మరో 9 మంది సేవాతత్పరులతో చేయూత ఫౌండేషన్ ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో కృషి చేస్తున్న సేవా సంస్థలన్నిటినీ ఐక్యపరిచి వాటి అనుభవాలను పంచుకుంటూ ఐక్యంగా కృషి చేస్తామన్నారు. మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ పాప పుణ్యాల పరిది దాటి దాతృత్వం వైపు అడుగులు వెయ్యాలని కోరారు. విద్య, పరిశోధనలపై పెట్టుబడులు పెరగాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ విద్య, వైద్యం పూర్తిగా ప్రభుత్వ రంగంలో కొనసాగాలని, నేడు ప్రభుత్వ పాఠశాలల్లో 90 శాతం మంది అణగారిన వర్గాల విద్యార్థులే చదువుతున్నారన్నారు. నాడు భూములకు ప్రాధాన్యత ఉండగా, నేడు విజ్ఞానానికి ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ అలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను తగ్గించడానికి పేదలకు నాణ్యమైన, నైపుణ్యం గల విద్య అందించాలని ఆ దిశగా చేయూత ఫౌండేషన్ కృషి జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆడిటర్ టిజెపిఎస్. కళాశాల సెక్రటరీ కెవి.బ్రహ్మం, కార్మెల్ సేవా సదన్ వ్యవస్థాపకులు జాక్ క్లమాకస్, పావులూరి రమేష్, కన్నా మాస్టర్, పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికుల కష్టంతోనే గుంటూరు నగరం జాతీయ స్థాయిలో ఖ్యాతి సాధించింది

– మేయర్ కోవెలమూడి రవీంద్ర

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ప్రజారోగ్య కార్మికుల కష్టం, త్యాగాలతోనే జాతీయ స్థాయిలో గుంటూరు నగరం ఖ్యాతిని సాధించిందని, కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. గుంటూరు నగరం సూపర్ స్వచ్ఛ లీగ్ అవార్డ్ పొందడంలో కీలకమైన ప్రజారోగ్య కార్యదర్శులకు, కార్మికులకు స్వచ్ఛ అచీవర్స్ పేరుతో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అభినందన సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో నిరంతరం కృషి చేస్తున్న ప్రజారోగ్య కార్మికుల కష్టానికి చేతులెత్తి నమస్కరిస్తున్నామ న్నారు. కార్మికులకు ఏ సమస్య ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకురావలని, అప్కాస్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందడంలేదన్న సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా పరిపాలన చేస్తుంద న్నారు. తొలుత నాట్య గురువు ఖలీల్ నేతృత్వంలో శాస్త్రీయ నృత్యం, ప్రజా గాయకులు రమణ నేతృత్వంలో జానపద నృత్యాలు, గీతాలు సభకు హాజరైన వారిని అలరించాయి. కార్యక్రమంలో ఏపి హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ భాష, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఎంహెచ్ఓ (ఇంచార్జి) రామారావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజారోగ్య కార్మికులు పాల్గొన్నారు.

రోడ్ సేఫ్టీపై హెచ్ఎంఎస్ఐ 1.5 లక్షల మందికి శిక్షణ

విశాలాంధ్ర-విజయవాడ: భారతదేశంలో సురక్షితమైన రహదారి అలవాట్లను ప్రోత్సహించే తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ, హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో తన సేఫ్టీ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ సెంటర్ (ఎస్‌డీఈసీ) 6వ వార్షికోత్సవాన్ని జరుపుకుంది. ఈ కార్యక్రమంలో విజయవాడ ప్రాంతీయ రవాణా అధికారి ఆర్.ప్రవీణ్ జిఎఆర్‌యు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు, వారు సురక్షితమైన రైడింగ్ పద్ధతులపై అవగాహన పెంచడంలో కేంద్రం పోషిస్తున్న పాత్రను గుర్తించారు. 2019 సెప్టెంబర్‌లో, హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (హెచ్ఎంఎస్ఐ) ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో వారి మొదటి సేఫ్టీ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ సెంటర్ (ఎస్‌డీఈసీ)ను ప్రారంభించింది. 2019 నుండి కొనసాగిన ఈ కార్యక్రమంలో విజయవాడ ఎస్‌డీఈసీ 1,50,000కు పైగా వ్యక్తులను శిక్షణ అందించింది. వీరిలో పాఠశాల పిల్లలు, కాలేజ్ విద్యార్థులు, పని చేసే ప్రొఫెషనల్స్ ఉన్నారు, వీరందరూ సైద్ధాంతిక మరియు ప్రాక్టికల్ సెషన్‌ల ద్వారా లబ్ది పొందారు.

శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవికి లక్ష కుంకుమ పూజ

విశాలాంధ్ర -కూచిపూడి : మొవ్వ మండలం పెదపూడి (బందరు రోడ్డు) ఆంధ్ర బ్యాంక్ సమీపంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన శనివారం అమ్మవారికి లక్ష కుంకుమ పూజ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించిన కనకదుర్గమ్మకు పాతికమందికి పైగా సువాసి నులు పాల్గొని నిర్వహించిన ఈ పూజా కార్యక్రమం పురోహితులు జంధ్యాల పాండురంగ శర్మ (కూచిపూడి) వేదమంత్రాల మధ్య అశేష మహిళలు, భక్తులనడుమకొనసాగింది.

రెండో విడత జీవిత భాగస్వామి పెన్షన్లు మంజూరు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలానికి ఎన్టీఆర్ భరోసా ద్వారా జీవిత భాగస్వామి (స్పౌజ్) పెన్షన్లు రెండవ విడత 26 విడుదల య్యాయి. ఆపెన్షన్లను అక్టోబర్ ఒకటవ తారీఖున పంపిణీ సిబ్బంది లబ్ధిదారులకు అందజేస్తారు. ఇదే విషయాన్ని ఆయా సచివా లయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు లబ్ధిదారులకు తెలిపారు. మంజూరైన లబ్ధిదారుల వివరాలు ఇవే కోసూరు సచివాలయానికి ఆరు, చినముత్తేవి, పెదసనగల్లు, పెదముతేవి రెండేసి చొప్పున, మంత్రి పాలెం, నిడుమోలు మూడేసి చొప్పున, కూచిపూడి, భట్లపెను మద్రు వేములమడ, సచివాలయాలకు ఒక్కొక్కటి చొప్పున మంజూరయ్యాయి.

శిశువులకు ఇవ్వవలసిన ఆహారంపై అవగాహన

విశాలాంధ్ర - ఘంటసాల : ఆచార్య ఎన్జి రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌రేవ్ విద్యార్థులు ఘంటసాల పాలెం అంగన్‌వాడీ పాఠశాలలో వీనింగ్ ఫుడ్స్‌పై శనివారం అవగాహన నిర్వహిం చారు. విద్యార్థులు శిశువుల వయస్సు ప్రకారం ఇవ్వవలసిన ఆహారాలపై డెమోనిస్ట్రేషన్ ఇచ్చారు. వారు మాట్లాడుతూ 6 నెలల శిశువులకు పప్పు నీరు, 7-8 నెలల శిశువులకు క్యారెట్ ముద్దలో నెయ్యి, 9 నెలల నుండి 1 సం॥ వయసున్న శిశువులకు కూరగాయల అన్నం ఇచ్చి, వాటి లాభాలు, పోషక విలువలు గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. తల్లిదండ్రులు శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తగిన ఆహారం ఇవ్వడంలో అవగాహన పొందారు. అంగన్వాడి టీచర్ జి కనకదుర్గ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

అపార్ ఐడి ప్రతి ఒక్కరు నమోదు చేయాలి

విశాలాంధ్ర-ఘంటసాల: మండల కేంద్రమైన ఘంటసాలలో నందం బజార్లోలోని అంగన్వాడీ సెంటర్ నందు సెక్టార్ మీటింగ్ నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి సిడిపిఓ ప్రసన్న విశ్వనాథ్ పాల్గొని ప్రసంగిస్తూ 5-6 సం॥ అపార్ కోడ్ ప్రతి అంగన్వాడీ కార్యకర్త నమోదు చేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకంపై ప్రతి ఒక్కరికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. మొదటి కానుపు మగ బిడ్డ అయిన ఆడబిడ్డ అయినా రూ6వేలు ఇస్తారని రెండూ కాన్పు కేవలం ఆడ బిడ్డ పుడితేనే రూ. 6వేలు ఇస్తారని అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ అప్పర్కోడ్ నమోదు చేసిన సర్టిఫికెట్లను అక్టోబర్ 4వ తారీఖున జరిగే సమావేశంలో ప్రవేశపెట్టాలని మొవ్వ సిడిపిఓ ప్రసన్న విశ్వనాథ్ తెలిపారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ టి రమానాగమణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.